RNI NO : TELTEL/2023/89146
Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:188 | గురువారం | 05 ఆగస్టు 2026 | పేజీలు :8 | వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

77309 83966    98491 98098



# రేవంత్‌కు విస్తరణ సెగ?

- కర్ణాటక పరిణామాలతో తెలంగాణ కాంగ్రెస్‌లో పెరిగిన అప్రమత్తత
- కేబినెట్ విస్తరణపై అధిష్ఠానం ఆచితూచి అడుగులు
- అసంతృప్తికి చెక్ పెట్టేందుకు ప్రత్యామ్నాయ పదవుల వ్యూహం
- సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ సమతుల్యతపై ప్రత్యేక దృష్టి

**తెలంగాణలో ఇంకా ఖాళీగా ఉన్న మంత్రి పదవుల భర్తీతో పాటు కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు జరిగే అవకాశాలపై ప్రచారం కొనసాగుతోంది. అయితే కర్ణాటక తరహాలో అసమ్మతి చెలరేగకుండా ముందుగానే అన్ని వర్గాలను సమన్వయం చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం పార్టీ నాయకత్వంలో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది.**

**హైదరాబాద్, ఆగస్టు 5:**
కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అనంతరం జరిగిన మంత్రివర్గ విస్తరణ కాంగ్రెస్ పార్టీకి కొత్త సవాళ్లను తెచ్చిపెట్టింది. మంత్రి పదవులు దక్కని పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం, కొందరు రాజీనామా హెచ్చరికలు చేయడం వంటి పరిణామాలు తెలంగాణ కాంగ్రెస్‌లోనూ చర్చకు దారితీశాయి. దీంతో తెలంగాణలో చేపట్టనున్న కేబినెట్ విస్తరణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానం మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.
తెలంగాణలో ఇంకా ఖాళీగా ఉన్న మంత్రి పదవుల భర్తీతో పాటు కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు జరిగే అవకాశాలపై ప్రచారం కొనసాగుతోంది. అయితే కర్ణాటక తరహాలో అసమ్మతి చెలరేగకుండా ముందుగానే అన్ని వర్గాలను సమన్వయం చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం పార్టీ నాయకత్వంలో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. మంత్రి పదవుల కోసం ఇప్పటికే పలువురు సీనియర్ నేతలు, యువ ఎమ్మెల్యేలు పోటీపడుతున్నారు. రెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ,

మిగతా 2వ పేజీలో..



## తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి

- తెలంగాణ-మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయండి
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి
- పీఎంకు లేఖ.. పీఎంవో స్పందనపై చర్చ
- చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామన్న కేంద్ర మంత్రి

**ఢిల్లీ, ఆగస్టు 5 :**
ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదన్నారు. ఢిల్లీలోని కేంద్ర మంత్రి పాటిల్ కార్యాలయంలో

మిగతా 3వ పేజీలో..

## విద్యార్థులకు వీసాలు పెంచాలి

- అమెరికా రాయబారి సెర్జియో గోర్‌ను కోరిన సీఎం రేవంత్

3

## సీఎం రేవంత్ విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి

- ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనాలో పర్యటన.

3

## 22ఏ భూముల పేరిట అన్యాయం జరగదు

- కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు
- ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని పనిచేయాలి
- అర్హుల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి
- కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

2





## ఈ నెలలో గోదావరి రెండో బ్రిడ్జిపై రాకపోకలు

- కోతకు గురవ్వకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

3



## డీలిమిటేషన్ బిల్లుకు రంగం సిద్ధం?

- ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలపై కేంద్రం కసరత్తు
- మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా ఆమోదింపజేయడమే లక్ష్యం
- సంఖ్యాబల సమీకరణలో బీజేపీ వ్యూహాత్మక అడుగులు

4

## తెలంగాణాకు అన్యాయం..!




- అనుమతించిన ప్రాజెక్టుల రద్దు చరిత్రలో ఎప్పుడైనా జరిగిందా?
- 18న జరగబోయే జీఆర్ఎంబీ సమావేశం అజెండా పూర్తిగా ఏపీకి అనుకూలం
- ఏపీ వితండవాదాన్ని ఎందుకు ఖండించడంలేదు
- సమ్మక్క-సారలమ్మ ప్రాజెక్టును ఏపీ అడ్డుకుంటోంది
- రేవంత్ తెలంగాణకు ద్రోహం చేసి గురుదక్షిణ చెల్లించుకుంటున్నరా?
- నిప్పులు చెరిగిన మాజీ మంత్రి హరీష్‌రావు

**హైదరాబాద్, ఆగస్ట్ 5:**
ఈనెల 18న హైదరాబాద్ వేదికగా హైదరాబాద్‌లో జరగబోయే గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం అజెండాపై తెలంగాణ భవన్‌లో బుధవారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రెస్ మీట్ నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చెరో ఎజెండాను సిద్ధం చేసుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వం మౌనం చూస్తుంటే జీఆర్ఎంబీ సమావేశం కేవలం ఏపీ ప్రయోజనాల కోసమే జరుగుతోందా అనే అనుమానం కలుగుతోంది. ఎజెండా వచ్చి ఇన్ని రోజులు అవుతున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం

మిగతా 2వ పేజీలో..

## హరీష్.. తప్పుడు ప్రచారం మానుకోండి

- కట్టు కథలతో బట్ట కాల్చి మీద వేయడమే మీ పనా?
- తొలుత కాళేశ్వరం ముడుపుల లెక్క చెప్పు
- ఏపీకి అమ్ముడుపోయి విమర్శలా
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 5 :**
ఏపీ ప్రభుత్వం పన్నెండేళ్లుగా ప్రతీ బోర్డు సమావేశంలో తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్నదని, ఇది కొత్త విషయం కాదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఏపీ ప్రాజెక్టులకు పరోక్షంగా మద్దతు ఇచ్చిన బీఆరఎస్ పార్టీ నేతలు అధికారం కోల్పోగానే కడుపు మంటతో బట్ట కాల్చి మీద వేస్తున్నారని విరుచుకుపడ్డారు. తెలంగాణ రైతాంగ ప్రయోజనాలు కాపాడే విషయంలో రాజీ లేదని స్పష్టం చేశారు. తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్న బీఆరఎస్ ఏ రోజూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడలేదని, ఆ పార్టీ ప్రభుత్వ హయాంలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు జరిగింది వాస్తవం కాదా, పోలవరం బనకచర్ల ప్రాజెక్టు పనులు ప్రారంuమైంది బీఆరఎస్ హయాంలో కాదా అని ప్రశ్నించారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం మీరు అధికారంలో ఉండగా పూర్తి కాలేదా అని నిలదీశారు. తెలంగాణ సొమ్మును లూటీ చేసి అధికారం కోల్పోగానే మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 18న జరిగే 18 జీఆరఎంబీ సమావేశం అజెండాలో చేర్చిన అంశాలు కొత్తవేమీ కావని, ఇవే

మిగతా 2వ పేజీలో..

## ఉప్పొంగుతున్న కృష్ణమ్మ

2

- జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు..
- తీర ప్రాంత ప్రజలకు అధికారుల హెచ్చరికలు
- సరిహద్దు కృష్ణ బ్రిడ్జి వద్ద ఆహ్లాదకర దృశ్యాలు





## 'వరల్డ్ పీపుల్స్'తో భారత్-రష్యా బంధాలు మరింత బలోపేతం

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఆగస్టు 5 :**
స్వాతంత్ర్యానంతరం భారతదేశ పారిశ్రామికాభివృద్ధికి, ఉక్కు కర్మాగారాలు, భారీ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటులో అప్పటి

మిగతా 2వ పేజీలో..



## హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

- నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ

3

## 'వరల్డ్ పీపుల్స్'తో భారత్-రష్యా బంధాలు మరింత బలోపేతం

మొదటిపేజీ తరువాయి

సోవియట్ యూనియన్ అందించిన సహకారం చిరస్మరణీయమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. భారత్‌రష్యా దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహం పరస్పర విశ్వాసం, గౌరవం, సహకారానికి ఇది నిదర్శనమన్నారు. హైదరాబాద్‌లో వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ ప్రతినిధి కార్యాలయాన్ని ఆ సంస్థ హెడ్ డాక్టర్ రాయల నీతునాయుడుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ప్రాథమిక విధుల భావనకు కూడా సోవియట్ రాజ్యాంగం ప్రేరణగా నిలిచిందని గుర్తు చేశారు. రక్షణ, విజ్ఞానం, అంతరిక్షం, సాంకేతికత, ఇంధనం, విద్య వంటి అనేక రంగాల్లో భారత్‌రష్యా సంబంధాలు మరింత బలపడుతున్నాయని తెలిపారు. మహిళలకు రాజకీయ, సామాజిక జీవితంలో సముచిత స్థానం కల్పించడంలో రష్యా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సీతక్క చెప్పార☐T. స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, ఉపాధి అవకాశాల కల్పన, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యాలయం ఏర్పాటుతో విద్య, వైద్యం, వ్యాపారం, పర్యాటకం, సంస్కృతి, పరిశోధన, ఆవిష్కరణలు, ప్రజల మధ్య పరస్పర సహకారం వంటి రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ చారిత్రక వారసత్వంతోపాటు సాంకేతిక రంగంలో ప్రపంచ గుర్తింపు పొందిన నగరమని పేర్కొన్న ఆమె ఈ కార్యాలయం భారత్‌రష్యా ప్రజల మధ్య మరింత సాన్నిహిత్యాన్ని పెంపొందించే వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్నేహం, శాంతి, అభివృద్ధి, సాంస్కృతిక అవగాహనకు దోహదపడే ప్రతి కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.

# రేవంత్‌కు విస్తరణ సెగ?

మొదటిపేజీ తరువాయి

మైనారిటీ వర్గాలకు చెందిన ఆశావహులు తమకు అవకాశం కల్పించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు సమాచారం. యువ నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన ఉన్నప్పటికీ, పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన సీనియర్లను పూర్తిగా పక్కనబెడితే అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి పదవులు దక్కని ముఖ్య నేతలకు నామినేటెడ్ కార్పొరేషన్ల ఛైర్మన్ పదవులు, జిల్లా ఇన్‌ఛార్జ్ బాధ్యతలు, ప్రభుత్వ సలహాదారు హోదాలు వంటి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించే దిశగా కసరత్తు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. కేబినెట్ విస్తరణకు ముందే ఈ సర్దుబాట్లు పూర్తి చేస్తే ప్రమాణ స్వీకారం తర్వాత అసమ్మతి తలెత్తకుండా నివారించవచ్చని పార్టీ వ్యూహంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ సమతుల్యతకు కూడా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యం దెబ్బతినకుండా, అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించే విధంగా కేబినెట్ కూర్పు ఉండాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కర్ణాటకలో చోటుచేసుకున్న అసంతృప్తి తెలంగాణలో పునరావృతం కాకుండా ఉండేందుకు మంత్రి పదవులతో పాటు ఇతర కీలక బాధ్యతలపై కూడా ఒకేసారి స్పష్టత ఇవ్వాలనే ఆలోచన కాంగ్రెస్ అధిష్ఠానంలో ఉన్నట్లు తెలుస్తోంది. కేబినెట్ విస్తరణను కేవలం పదవుల పంపకంగా కాకుండా, పార్టీ ఐక్యతను బలోపేతం చేసే రాజకీయ వ్యూహంగా మలచాలనే దిశగా రేవంత్ రెడ్డి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

# 22ఏ భూముల పేరిట అన్యాయం జరగదు

హైదరాబాద్, ఆగస్ట్ 5:

రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూ హక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదన్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సమావేశం క్యూర్ పరిధి జిలాల్లకు సంబంధించినదైనా ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా పనిచేయాలి**

22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్ లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని, దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. 22ఏ జాబితాలో ఉన్న భూములపై సమగ్ర పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్లకు ఉందని గుర్తుచేస్తూ, ప్రజల హక్కులు, ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు.



# ఉప్పొంగుతున్న కృష్ణమ్మ

హైదరాబాద్, ఆగస్ట్ 5 :

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కర్ణాటక పరివాహక ప్రాంతాల నుంచి భారీగా ప్రవాహం రావడంతో కృష్ణా, భీమా నదుల్లో వరద ఉధృతి గణనీయంగా పెరిగింది. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కృష్ణానదిపై నిర్మించిన గుర్జాపూర్ బ్యారేజీ తో పాటు యాదగిరి జిల్లా భీమా నదిపై ఉన్న గుగ్గల్ బ్యారేజీలకు వరద నీరు పోటె త్తింది. దీంతో అధికారులు అప్రమత్తమై ఈ బ్యారే జీల 40 గేట్లను ఎత్తి దిగువకు భారీగా నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద జలా లు తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టుకు చేరుతుండటం తో నది పరివాహక ప్రాంతం జలకళను సంతరించుకుంది. నది పూర్తిగా నీటితో నిండిపోవడంతో తెలంగాణకర్ణాటక సరి హద్దులోని కృష్ణ బ్రిడ్జి కింద ప్రవహిస్తున్న వరద ప్రవాహం ఆహ్లాదకర దృశ్యాన్ని తలపిస్తోంది. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులతో పాటు ప్రయాణికులు కూడా బ్రిడ్జి వద్దకు చేరుకుని ఫొటోలు, వీడియో లు తీసుకుంటున్నారు. కృష్ణా నదిలో ప్రవాహం రోజురోజుకు వర ద ప్రవాహం పెరుగుతుండడంతో జూరా ల ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నది పరివా హక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండా లని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, వర ద ఉధృతి కారణంగా నదిలో స్నానాలు చేయకుండా, చేపల వేటకు వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# నేడు సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ

- **సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సభ నిర్వహణకు ఏర్పాట్లు**
- **సభా ప్రాంగణంలో ప్రముఖుల ఫ్లెక్సీలు**

హైదరాబాద్, ఆగస్టు 5 :






సాధించుకున్న భౌగోళిక తెలంగాణను సామాజిక న్యాయ తెలంగాణగా పునర్నిర్మించే కర్తవ్యాన్ని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన భుజానికి ఎత్తుకున్నారు. సబ్బండ వర్గాల వికాసం.. సాధికారతే లక్ష్యంగా సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను గురువారం నిర్వహిస్తున్నారు. సామాజిక వైతాళికులను కీర్తించుకునేలా సభా ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్రానికి కొత్త రాజకీయాలను పరిచయం చేస్తూ అందులో ఆయా వర్గాల వారిని ఆమె భాగస్వామ్యం చేయబోతున్నారు. సభా ప్రాంగణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, తన జీవితం మొత్తాన్ని తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం త్యాగం చేసిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్, సామాజిక అంతరాలను రూపుమాపేందుకు కృషి చేసిన మహనీయులు మహాత్మా జ్యోతిబా పూలే, మొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే, అట్టడుగు వర్గాల ప్రజలు పేదరికం, పీడన నుంచి బయట పడేందుకు విద్య మాత్రమే ఆయుధమని నమ్మి పాఠశాలలు ఏర్పాటు చేసిన భాగ్యరెడ్డి వర్మ చిత్రపటాలను సభా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నారు. నిజాం రాజ్యంలో దేశ్‌ముఖ్‌లు, దొరల దురహంకారం పై తిరుగుబాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య, నిజాం సింహాసనాన్ని వణికించిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, బహుజనులకు రాజ్యాధికారం కోసం కృషి చేసిన కాన్షీరామ్, జల్‌జంగిల్‌జమీన్‌పై హక్కుల కోసం పోరు సాగించిన యోధుడు కొమురం భీమ్, నిఖార్సయిన తెలంగాణవాది, ప్రత్యేక తెలంగాణ కోసం మంత్రి పదవి తృణప్రాయంగా వదులుకున్న బహుజన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ, సమాజంలో దోపిడీకి గురవుతున్న వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన కర్పూరి ఠాకూర్ చిత్రపటాలు ఏర్పాటు చేస్తున్నారు. తొలి తరం తెలంగాణ ఉద్యమకారిణి, ఉమ్మడి ఏపీలో మొదటి దళిత మహిళా ఎమ్మెల్యే, మొదటి మహిళా డిప్యూటీ స్పీకర్ టీఎన్ సదాలక్ష్మి, నిజాం నిరంకుశత్వంపై పోరాడిన బహుజన యోధుడు పండుగ సాయన్న, బహుజన గెరిల్లా యోధుడు వడ్డెర ఓబన్న, బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్, ఉమ్మడి ఏపీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన మొదటి మహిళా నాయకురాలు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు సంగం లక్ష్మీబాయి, రజాకర్ల అరాచకాలపై తన కలాన్ని ఎక్కుపెట్టిన అక్షర యోధుడు షోయబుల్లాఖాన్, మలి దశ రాష్ట్ర సాధన పోరాటానికి ఆద్యుడు, కులవర్గ పోరాట సిద్ధాంతకర్త మారోజు వీరన్న, నిజాం పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రముఖ కవి, కార్మిక నాయకుడు మఖ్దూం మొహియుద్దీన్‌ల విగ్రహాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

# తెలంగాణాకు అన్యాయం..!

మొదటిపేజీ తరువాయి

దారుణమన్నారు. కేఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ సాధించుకున్న సాగునీటి ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని ఆయన మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం, సీతారామ, సమ్మక్క సాగర్ (47 టీఎంసీలు) వంటి 7 కీలక ప్రాజెక్టులకు తెచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం పంపిన ఈ ప్రతిపాదనలను జీఆర్ ఎబీ తన అజెండాలో చేర్చడంపై నిప్పులు చెరిగారు. ఈ అజెండా పూర్తిగా ఏపీకి లాభం చేకూర్చేలా ఉందని ఆరోపించారు. రాష్ట్ర నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడికి 'గురుదక్షిణ' చెల్లించుకోవడానికే సీఎం నోరు మెదపడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేకపోయిందని, ఉన్న అనుమతులను కూడా పోగొట్టుకునేలా ప్రవర్తిస్తోందని విమర్శించారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతులు ఇవ్వవద్దని ఏపీ చెబితే, దాన్ని బోర్డు అజెండాలో ఎలా పెడతారని ప్రశ్నించారు. మల్లన్నసాగర్ కట్టొచ్చు కానీ సమ్మక్క బ్యారేజీ ఎందుకు వద్దంటున్నారని నిలదీశారు. కాళేశ్వరం అనుమతులు రద్దయితే సగం తెలంగాణకు తాగు, సాగునీరు దూరం అవుతుందని.. నీటి విషయంలో అన్యాయం జరిగితే తెలంగాణ ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను గంపగుత్తగా ఏపీకి తాకట్టు పెట్టాలని చూస్తున్నారా? చంద్రబాబు తెలంగాణకు ద్రోహం చేయాలని చూస్తుంటే... రేవంత్ రెడ్డి రక్తం ఎందుకు మరగడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను తాను ఎప్పుడూ వ్యతిరేకించలేదని పదేపదే చెబుతారు. కానీ జీఆర్ఎంబీ ముందు పెట్టిన ఎజెండా చూస్తే



అసలు నిజం ఏంటో అర్థమవుతుంది. కాళేశ్వరం, చౌటుపల్లి హన్మంతరావు, చిన్న కాళేశ్వరం, చనాకాకొరటా, మోదికుంట వాగు, కడెం గూడెం లిఫ్ట్, సీతారామ లిఫ్ట్ వంటి ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులను నిలిపివేయాలని, వాటిని పునఃసమీక్షించాలని ఏపీ కోరుతోంది. సమ్మక్క బ్యారేజీకి సంబంధించిన క్లియరెన్సులను కూడా నిలిపివేయాలని ఏపీ ప్రతిపాదిస్తోంది. కేసీఆర్ ప్రభుత్వం సాధించిన ఈ ఏడు ప్రాజెక్టుల అనుమతులను రివ్యూ చేయాలని ఏపీ కోరుతోంది. ఆ ప్రతిపాదనను జీఆర్ఎంబీ ఎజెండాలో చేర్చడం అత్యంత దుర్మార్గమైన విషయం. ఖమ్మం జిల్లాకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు వస్తున్నాయంటే... కేసీఆర్ ప్రభుత్వం సాధించిన అనుమతుల వల్లే. ఇప్పుడు అదే సీతారామ ప్రాజెక్టు అనుమతులను రద్దు చేయాలని ఏపీ కోరుతోంది. తెలంగాణకు చెందిన ఏడు కీలక ప్రాజెక్టుల అనుమతులను నిలిపివేయాలని ఏపీ ప్రతిపాదిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం ఏం చేస్తోంది? ఇంజినీర్లు ఏం చేస్తున్నారు? ఇప్పటికే అనుమతులు సాధించిన ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే అధికారం ఎవరు ఇచ్చారు? తెలంగాణ కోసం ఉద్యమం చేసి కేసీఆర్ ప్రభుత్వం 383 టీఎంసీల గోదావరి జలాలకు అనుమతులు సాధించింది. ఇప్పుడు ఆ అనుమతులను రద్దు చేసే పరిస్థితి ఎందుకు వచ్చింది? కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దాదాపు మూడేళ్లలో ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతి తీసుకురాలేదు. సమ్మక్క, పాలమూరు, వార్ధా ప్రాజెక్టుల డీపీఆర్‌లు రిటర్న్ వచ్చాయి. ఒక్క టీఎంసీ నీటికి కూడా కొత్తగా అనుమతి సాధించలేదు. పైగా బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన ఏడు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే పరిస్థితి తీసుకొచ్చారు. తెలంగాణ భవిష్యత్తుతో ఆడుకుంటారా? నిద్రపోతున్నారా? ఎజెండాలో ఈ అంశాలు రావడమే దుర్మార్గమైన విషయమన్నారు. దేశ చరిత్రలో అనుమతులు వచ్చిన తర్వాత వాటిని రివ్యూ చేయడం, రద్దు చేయడం జరిగిన సందర్భాలు ఎక్కడైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. మరోవైపు సమ్మక్క బ్యారేజీకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వొద్దని ఏపీ కోరుతోంది. సమ్మక్కకు అనుమతి ఇస్తే పోలవరానికి నీళ్లు తగ్గుతాయని ఏపీ ఎజెండాలో పేర్కొంది .గోదావరిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని చంద్రబాబు ప్రభుత్వమే చెబుతోంది. గోదావరిబనకచర్ల ప్రాజెక్టు ద్వారా నల్లమల సాగర్‌కు నీళ్లు తీసుకెళ్తామని చెబుతున్నారు. మరోవైపు తెలంగాణకు దక్కాల్సిన 968 టీఎంసీలలో భాగంగా సమ్మక్క ప్రాజెక్టు నిర్మిస్తామంటే ఏపీ అడ్డుకుంటోంది. సమ్మక్క సాగర్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటికే అనుమతులు సాధించిందని గుర్తుచేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఇలాంటి ఎజెండా జీఆర్ఎంబీ ముందుకు వచ్చేదా? అని ప్రశ్నించారు. ఈ ప్రెస్ మీట్ లో మాజీ మంత్రులు ఎల్.రమణ, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ రవీందర్ రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# హరీష్.. తప్పుడు ప్రచారం మానుకోండి

మొదటిపేజీ తరువాయి

అంశాలను గత మీటింగులలో, కరెస్పాండెన్స్‌లో కూడా ఏపీ ప్రభుత్వం ప్రస్తావిస్తూ వస్తున్నదన్నారు. ఇవే అంశాలు సీతారామ ఎత్తిపోతల పథకం క్లియరెన్స్ విషయంలోనూ ప్రస్తావించిందన్నారు. దీనిపై తమ ప్రభుత్వం దీటుగా స్పందించి అవన్నీ నిరాధారమైనవని జీఆరఎంబీకి, సీడబ్ల్యూసీ దృష్టికి తీసుకువెళ్లి ఎసఎసఎంపీఎసఆరఎలఐపీ టీఏసీ క్లియరెన్స్(158 మీటింగ్ తేదీ 24.04.2025) విజయవంతంగా అనుమతులు సాధించిందని మంత్రి ఉత్తమ్ గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏపీ ప్రభుత్వం నిరంతరం జీఆరఎంబీ, సీడబ్ల్యూసీ, జలశక్తి మంత్రిత్వ శాఖకు కాళేశ్వరం, సీతారామ, సమ్మక్క, చిన్న కాళేశ్వరం, చనాకాకొరటా, మోదికుంట వాగు, గూడెం లిఫ్ట్ తదితర ఏడు ప్రాజెక్టుల అనుమతులు ఇవ్వరాదని కోరుతూ వచ్చిందని తెలిపారు. ఎంవోజేఎస్ ద్వారా టీఏసీ క్లియరెన్స్ పొందిన తరువాత కూడా సమీక్షించాలని ఏపీ ప్రతి మీటింగ్‌లో ప్రస్తావిస్తున్నదన్నారు. ఈ సందర్భంలో చెప్పదగ్గ విషయం ఏమిటంటే ఏపీ లేవనెత్తిన ఆ అంశాలను ఈ ప్రభుత్వం దీటుగా ప్రతిఘటించి మన రాష్ట్ర నీటి హక్కులను కాపాడడంలో సఫలీకృతమైనదని స్పష్టం చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉదాసీనత ప్రదర్శించడంలేదన్నారు. గత బీఆరఎస్ ప్రభుత్వమే 3వ జీఆరఎంబీ మీటింగ్‌లో రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీకి సంబంధించి ఆయా రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదరాలి లేదా ఒక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలి అని తన వైఖరిని స్పష్టం చేసిందని తెలిపారు. ఈ రెండు రాష్ట్రాలకు నీటి సరఫరా నియంత్రణను జీఆరఎంబీ ప్రారంభించే ముందే ఈ షరతులలో ఏదో ఒకటి నెరవేరాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ఇదే విషయాన్నీ పునరుద్ఘాటిస్తూ గత బీఆరఎస్ ప్రభుత్వం సెకండ్ అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో (6.10.2020) ట్రిబ్యునల్ ఏర్పాటు కోసం ఏపీతో పోటీ పడి కోరిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం సమయస్ఫూర్తితో అడుగులు వేసి కేంద్ర ప్రభుత్వం జలశక్తి మంత్రిత్వ శాఖ ద్వారా ట్రిబ్యునల్ ఇప్పటివరకు ఏర్పడకుండా అడ్డుకున్నదన్నారు. ఇదీ ఈ ప్రభుత్వం నిబద్ధత అని అన్నారు.

అంతర్రాష్ట్ర వ్యవహారాల(ఐఎసఎం) డైరెక్టరేట్ క్లియరెన్స్, ఏపీ క్లియరెన్స్ పొందడంలో గత ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ముంపు సమస్యకు సంబంధించి కూడా గత ప్రభుత్వం ఆ రాష్ట్రంతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని చాలాసార్లు సంప్రదించి/సందర్శించి, ఐఎసఎం డైరెక్టరేట్ క్లియరెన్స్ పొందేందుకు ముంపు సమస్యకు సంబంధించి ఛత్తీస్‌గఢ్ నుండి నిరభ్యంతర పత్రం పొందేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎన్వోసీ కోసం మూడుసార్లు ఛత్తీస్‌గఢ్ సీఎంను కలిసి ఎన్వోసీ కోసం విజ్ఞప్తి చేశామన్నారు. నెలాఖరులో ఇస్తామని సీఎం చెప్పారన్నారు. మీరు అధికారంలో ఉండగా ఒక్కసారి అయినా ఛత్తీస్‌గఢ్ సీఎం ను కలిశారా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభ్యంతరాలను సమర్థవంతంగా ప్రతిఘటించి రాష్ట్రం ఏర్పడిన తరువాత మొట్టమొదటి బహుళార్థసాధక సీతమ్మ సాగర్ - సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు టీఏసీ అనుమతులు 24.4.2025న సాధించిందని చెప్పారు. తొమ్మిదిన్నరేళ్లలో మీరు చేయలేని పని చేశామని, 67 టీఎంసీల నీటి కేటాయింపులు సాధించామని చెప్పారు. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించినట్టు ట్రిబ్యునల్ ఏర్పరిచే విషయంలో కూడా ఈ ప్రభుత్వం సమయస్ఫూర్తితో అడుగులు వేసి కేంద్ర ప్రభుత్వం జలశక్తి మంత్రిత్వ శాఖ ద్వారా ట్రిబ్యునల్ ఇప్పటివరకు ఏర్పడకుండా అడ్డుకుందన్నారు.

పీబీఎల్‌పీ ప్రతిపాదన గురించి తెలిసిన తర్వాత ఈ ప్రభుత్వం వెనువెంటనే స్పందించిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ చెప్పారు. ఇప్పటివరకు ముఖ్యమంత్రి రెండుసార్లు, నీటిపారుదల శాఖ మంత్రిగా తాను ఏడుసార్లు, పదిసార్లు ప్రధాన కార్యదర్శి, ఈఎన్‌సీ(జి)19 సార్లు వివిధస్థాయిల అధికారుల ద్వారా ఎంవోఎఫ్, ఎంవోజేఎస్, ఎంవోఈఎఫ్ అండ్ సీసీ, సీడబ్ల్యూసీ, జీఆరఎంబీ, కేఆరఎంబీ, టీ పీపీఏలతో సుదీర్ఘమైన ఉత్తరప్రత్యుత్తరాలు జరిపామన్నారు. న్యాయపరమైన చర్యలో భాగంగా ప్రభుత్వం సుప్రీమ్ కోర్టు ముందు ఒరిజినల్ సూట్, ఐఏ వ్యాజ్యాలు వేసిందన్నారు. ప్రతివాదులందరూ నాలుగు వారాల్లోగా తమ సమాధానాలను దాఖలు చేయాలని న్యాయస్థానం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందన్నారు. 20182022 మధ్య కాలంలో రాయలసీమ ప్రాంతానికి 200 టీఎంసీల వరద నీటిని తరలించే పనులను ఏపీ ప్రభుత్వం చేపట్టినప్పటికీ అప్పటి బీఆరఎస్ ప్రభుత్వం మాత్రం ప్రేక్షకపాత్రకే పరిమితం కాలేదా అని నిలదీశారు. ఆర్డీఎస్‌లో వాటా మేరకు నీళ్ల కోసం ఏ రోజూ బీఆరఎస్ ప్రయత్నం చేయలేదన్నారు. ఆర్డీఎస్ ఆధునికీకరణ విషయంలో ఏపీ, కర్ణాటక సీఎంలను ఒప్పించాం.. మీరు ఏ రోజైనా కర్ణాటక సీఎంను కలిసి ఒప్పించారా అని నిలదీశారు. కేడబ్ల్యూడీటీలో కృష్ణా జలాల వాటా కోసం స్వయంగా విచారణకు హాజరై న్యాయనిపుణులతో సూచన చేశామన్నారు. గత ప్రభుత్వం కంటే సమర్థవంతంగా వాదనలు వినిపిస్తున్నామని, రాష్ట్ర ప్రజల నీటి హక్కులను పరిరక్షించేందుకు ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని చెప్పారు. బేసిన్లు లేవు.. భేషజాలు లేవు అనే సిద్ధాంతం కలిగిన బీఆరఎస్ ద్వంద్వ విధానాలతో తాము నేర్చుకోవాల్సింది ఏమీ లేదన్నారు. తొలుత కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఏపీ కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు అందాయనే కవిత ఆరోపణలకు జవాబు చెప్పాలన్నారు. అ ముడుపుల్లో నీ వాటా ఎంత. తెలంగాణలో అధికారంలోకి రావడం లేదని ఏపీతో కుమ్మక్కై నాగార్జున సాగర్ ప్రాజెక్టును వివాదం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును నిండా ముంచి సిగ్గులేకుండా రాజకీయాలు చేస్తావా అని మంత్రి హరీష్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి బుధవారం ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానికి ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్ శక్తికి పంపిన లేఖ విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 148 మీటర్ల నుంచి 152 మీటర్ల వరకు ఎత్తుతో బ్యారేజీ నిర్మించే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ (సీడబ్ల్యూపీఆరఎస్) అధ్యయనం నిర్వహించిందని కేంద్ర మంత్రికి వివరించారు. ఆ అధ్యయనం ప్రకారం 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా, 152 మీటర్ల ఎత్తులో నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందన్నారు. ముంపులోనూ 50 శాతం నదీ గర్భం(రివర్ బెడ్)లోనే ఉంటుందని కేంద్ర మంత్రి పాటిల్‌కు వివరించారు. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారా కావల్సినంత నీరు సరఫరా చేయలేమని, కాబట్టి 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు. తుమ్మిడిహెట్టి వద్ద 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారానే నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. గ్రావిటీ ద్వారా నీటి సరఫరాతో విద్యుత్ వినియోగం భారం ఉండదని, ఈ నేపథ్యంలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు. ఈ అంశంపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి పాటిల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే పూర్తిగా వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు నీటి వసతి ఏర్పడుతుందని వివరించారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి లేఖ అందిందని మంత్రి పాటిల్ సీఎంకు తెలిపారు. ఈ అంశంపై మొదట కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ, మహారాష్ట్రస్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. ఆ తర్వాత రెండు రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తానని జల్‌శక్తి మంత్రి ముఖ్యమంత్రికి తెలిపారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ.శ్రీధర్ పాల్గొన్నారు.

**పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, డిండిలకు పర్యావరణ అనుమతులు ఇవ్వండి**

పాలమూరురంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులకు సత్వరమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రితోపాటు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పార్లమెంటులో బుధవారం కేంద్ర మంత్రితో సమావేశమయ్యారు. ఇటీవలి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతలపై రూ.3,187 కోట్లు, సీతమ్మ సాగర్‌పై రూ.1,835 కోట్లు, గౌరవెల్లిపై రూ.1,350 కోట్లు వ్యయం చేసిందని, అయితే అనుమతులు రాక పనులు నిలిచిపోయాయని, ఫలితంగా ప్రాజెక్టుల వ్యయం పెరుగుతోందని కేంద్ర మంత్రికి వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు సానుకూలత నేపథ్యంలో ప్రాజెక్టులకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని భూపేందర్ యాదవ్‌ను సీఎం రేవంత్ కోరారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వీసాలు పెంచాలి

**ఢిల్లీ, ఆగస్టు 5 :**



ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే తెలంగాణ విద్యార్థులకు వీసాలను పెంచాలని, వీసా అపాయింట్‌మెంట్లు సకాలంలో లభించేలా సహకరించాలని భారత్‌లోని అమెరికా రాయబారి సెర్జియో గోర్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కోరారు. ఆయనతో ఢిల్లీలో బుధవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. 30 నిమిషాలకుపైగా కొనసాగిన ఈ భేటీలో వివిధ అంశాలు చర్చించారు. తెలంగాణలో విద్య, ఉపాధి, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. వీసా ఇంటర్వ్యూ స్లాట్లను పెంచాలని, వీసా దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని కోరారు. అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న తెలంగాణకు చెందిన వివిధ రంగాల నిపుణుల సమస్యలను కూడా రాయబారి దృష్టికి తీసుకెళ్లారు. హెచ్ 1బి వీసా ప్రాసెసింగ్, రెన్యువల్, వీసా స్టాంపింగ్ ఆలస్యం కాకుండా సరళతరం చేయాలని, . వీసా నిబంధనల్లో వచ్చే మార్పులపై ముందుగానే సమాచారం అందించాలని కోరారు. అమెరికాలో చదువుతున్న తెలంగాణ విద్యార్థుల భద్రత, సంక్షేమంపై కూడా చర్చించారు. తెలంగాణలో అమెరికా సంస్థలకు విస్తృత పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. ఐటీ, కృత్రిమ మేధ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, స్టార్టప్‌లు, పరిశోధన, ఆధునిక సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని తెలిపారు. అమెరికా విశ్వవిద్యాలయాలు తెలంగాణ విద్యాసంస్థలతో కలిసి పనిచేసేలా సహకరించాలని కోరారు. విద్యార్థుల మార్పిడి, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. అమెరికాలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న భారతీయ భాషల్లో తెలుగు ఒకటని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. దేశ చరిత్ర, సంస్కృతిపై రాయబారి సెర్జియో గోర్‌కు ఉన్న అవగాహన తనను ఆకట్టుకున్నదన్నారు. ప్రత్యేకంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలు, రాష్ట్ర బలాలపై రాయబారి చూపిన ఆసక్తిని ముఖ్యమంత్రి అభినందించారు. తెలంగాణఅమెరికా మధ్య వ్యాపారం, పెట్టుబడులు, సాంస్కృతిక మార్పిడి, ప్రజల మధ్య సంబంధాలను మరింత విస్తరించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని రాయబారి సెర్జియో గోర్ హామీ ఇచ్చారు.

# ఈ నెలలో గోదావరి రెండో బ్రిడ్జిపై రాకపోకలు

**భద్రాచలం, ఆగస్టు 5 :**

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దర్శనానికి దేశ విదేశాల నుండి భక్తులు లక్షల మంది వస్తూ ఉంటారని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భక్తుల సౌకర్యం కోసం రెండవ బ్రిడ్జి నిర్మాణం చేపట్టామని వ్యవసాయ, మార్కెటింగ్, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గత వరదల సమయములో రెండో బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు కోతకు గురైన విషయం విదితమే. ఈ రోడ్డు పునర్నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించి అధికారులతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకుని నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వేగవంతం చేసి ఈ నెలలో బ్రిడ్జిపై రాకపోకలు పునరుద్ధరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు దేశ విదేశాల నుండి భక్తులు రామయ్య దర్శనానికి వస్తూ ఉంటారని, అలాగే ముఖ్యమైన గోదావరి పుష్కరాలు, ముక్కోటి, శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవాల సందర్భంగా భక్తులు అధికంగా వస్తుంటారన్నారు. ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని 2015 లో జరిగిన గోదావరి పుష్కరాల సందర్భంగా వచ్చిన లక్షలాది మంది భక్తులకు ఒకే బ్రిడ్జి వల్ల ట్రాఫిక్ సమస్యలు రావడంతో అమరావతి టు జగదల్పూర్ జాతీయ రహదారి భద్రాచలం మీదుగా ప్లాన్ చేసి రెండవ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రారంభించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో నిర్మాణం పనులు నత్తనడకగా సాగాయని, తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే బ్రిడ్జి నిర్మాణం పనులు వేగవంతం చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చూసామని అన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రెండవ బ్రిడ్జి అందుబాటులో ఉంటుందని అన్నారు. వరదలు ఎన్ని వచ్చినా అప్రోచ్ రోడ్డు కోతకు గురవకుండా పకడ్బందీగా రిటైనింగ్ వాల్ నిర్మాణం పనులు జరుగుతున్నాయని, ఈ నెలాఖరు వరకు పనులు పూర్తి చేసి రెండవ బ్రిడ్జిపై రాకపోకలు జరిగేలా చూస్తామని అన్నారు. రెండవ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో ఆంధ్ర ప్రదేశ్, ఛత్తీస్గడ్, ఒడిస్సా వయా భద్రాచలం వెళ్లే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# గ్లోబల్ సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు చేయాలి

- **అన్ని శాఖలు సమన్వయంతో కార్యాచరణ రూపొందించాలి**
- **ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**హైదరాబాద్, ఆగస్టు 5:**

డిసెంబర్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ 2026 గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సచివాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారం అత్యంత అవసరమని అన్నారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధికి గ్లోబల్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. తెలంగాణను అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ' అమలు చేస్తోందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంపొందించడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో అధికారులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

- **నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ**
- **8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం**

**హైదరాబాద్, ఆగస్ట్ 5 :**

హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాదాపు ఎనిమిది ప్రైవేటు కాలేజీలు.. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేశాయి. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తూ నకిలీ ఫైర్ ఎన్వోసీలను సృష్టించిన కళాశాలలు.. వాటిని ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ విషయం గుర్తించిన అధికారులు దీనిపై విచారణ చేపట్టగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించారు. దీంతో నకిలీ పత్రాలు సమర్పించిన ఎనిమిది ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ ఘటనపై లేక్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయ్యింది. ఫోర్జరీ, నకిలీ పత్రాల సృ తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ నో అబ్జక్షన్ సర్టిఫికెట్లు సృష్టించి ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించిన అధికారులు 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలపై కేసు నమోదు చేశారు. ఈ పత్రాల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయడంతో లేక్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. దర్యాప్తులో తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, మెహిదీపట్నం, బర్కత్పురా ప్రాంతం లోని 8 ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఈ ఫోర్జరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేటు కాలేజీ ఫైర్ ఎన్ఓసీలను కూడా అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు. వాటి ప్రామాణికతపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని అక్రమాలకు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# సీఎం రేవంత్ విదేశీ పర్యటనకు
# ఏసీబీ కోర్టు అనుమతి

**హైదరాబాద్, ఆగస్టు 5:**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించేందుకు ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం అనుమతించింది. ఇందుకోసం కోర్టు కస్టడీలో ఉన్న ఆయన పాస్ పోర్టులను తాత్కాలికంగా విడుదల చేయాలని ఆదేశించింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో విదేశీ పర్యటన చేపడుతున్నట్లు రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పాస్ పోర్టులను తాత్కాలిక కస్టడీనుంచి విడుదల చేయడంతోపాటు విదేశీ ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించింది. విదేశీ పర్య టనకు అనుమతి ఇస్తూనే కోర్టు పలు షరతులు విధించింది. లక్ష వ్యక్తిగత బాండ్‌తోపాటు ఒక ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రయాణ వివరాలు, అక్కడ బస చేసే చిరునామాలు, సంప్రదింపు ఫోన్ నంబర్లు కోర్టుకు అందజేయాలని పేర్కొంది. అలాగే, సెప్టెంబర్ 18లోగా పాస్ పోర్టులను తిరిగి కోర్టులో జమ చేస్తానని అఫిడవిట్ దాఖలు చేయాలని రేవంత్ రెడ్డిని ఆదేశించింది. ఆ అఫిడవిట్ సమర్పించిన అనంతరం ప్రాంతీయ పాస్ పోర్టు అధికారికి లేఖ రాసి పాస్ పోర్టులను తాత్కాలికంగా అప్పగించాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **గాంధీ భవన్‌లో 'ప్రజలతో ముఖాముఖి'**
- **ప్రతి వినతిపై బాధ్యతగా స్పందించి న్యాయం చేస్తాం**
- **పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

**హైదరాబాద్, ఆగస్టు 5 :**



ప్రజల విశ్వాసమే మా బలం.. ప్రజల మాటే ప్రభుత్వ నిర్ణయాలకు మార్గదర్శకం అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు తమ సమస్యలను చెప్పుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని, పాలకులు ప్రజలకు దూరంగా ఉండటంతో అనేక సమస్యలు పేరుకుపోయాయని విమర్శించారు. ప్రజల కష్టాలు, బాధలు, ఆశలు, ఆకాంక్షలు తెలుసుకోవాలంటే ప్రజల మధ్యకే వెళ్లాలన, అందుకే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రతి వారం నిర్వహిస్తోందని తెలిపారు. గాంధీ భవన్‌లో ముఖాముఖి కార్యక్రమం బుధవారం జరగగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మంత్రి సీతక్క నేరుగా వినతులు స్వీకరించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో సమీక్షించారు. వచ్చిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని, పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలు వినడమే కాక వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రజా పాలనలో ప్రజల సమస్యల పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు.

**ప్రధానంగా వచ్చిన వినతులు**


ధరణి అమలులో జరిగిన అక్రమాల కారణంగా తమ భూములు ఇతరులు ఆక్రమించుకున్నారని, రాత్రికి రాత్రే పట్టాదారు పాస్ పుస్తకాల్లో మార్పులు జరిగాయని పలువురు బాధితులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు రాని అర్హులైన కుటుంబాలు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. పోలీసు నియామకాల్లో వయోపరిమితి పెంచాలని యువత విజ్ఞప్తి చేసింది. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షలతో నమోదు చేసిన పోలీసు కేసులను ఎత్తివేయాలని పలువురు వినతిపత్రాలు సమర్పించారు. అటవీ శాఖ అధికారుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ హక్కులను పరిరక్షించాలని కోరుతూ పలువురు గిరిజనులు, అటవీ ప్రాంతాల ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో అన్యాయానికి గురైన వివిధ వర్గాలకు న్యాయం చేయాలని పెద్ద సంఖ్యలో ప్రజలు కోరారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించారు. అనంతరం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లుగా గత ప్రభుత్వం వదిలివెళ్లిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తోందని తెలిపారు. ప్రజలు ప్రజా ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసంతోనే రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చి తమ వినతులను అందజేస్తున్నారని చెప్పారు. ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.


# డయల్ 112 సేవలు ప్రారంభం

- **పోలీస్,ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్**
- **సేవలను ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్**

**హైదరాబాద్,ఆగస్ట్ 5:**

రాష్ట్రంలో డయల్ 112 సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఏ ఫిర్యాదుకైనా ఇక 112 ద్వారా సమాధానం వస్తుంది. డీజీపీ సీవీ ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గమని వ్యాఖ్యానించారు. డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు పోలీసులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఒకే వ్యవస్థలోకి పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు, టిజిఐసిసి నుంచి డయల్ 112 సేవలను పర్యవేక్షిస్తామని డీజీపీ తెలిపారు. ప్రజల భద్రత, అత్యవసర స్పందన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. డయల్ 112 ఫోన్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్ కాల్స్ వాడుతున్నామని పేర్కొన్నారు. డ్రోన్ బెస్డ్ టెక్నికల్ సిస్టంను త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తారని వివరించారు. డ్రోన్ టీమ్‌ను సైతం ఏర్పాటు చేయబోతున్నామని చెప్పుకొచ్చారు. డయల్ 112 అనేది 3.0 వర్షన్‌గా ఉంటుందని తెలిపారు. యువ ఏపీఎస్‌లు, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయబోతున్నామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. బేసిక్ పోలీసింగ్ లాగా టెక్నాలజీ పోలీసింగ్‌ను అమల్లోకి తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్‌లో రెండు ఫ్లోర్‌లను డయల్ 112కి కేటాయించామని తెలిపారు. డయల్ 100ను 2013లో కొంపల్లిలో జివికె వారి సాయంతో ప్రారంభించామని ప్రస్తావించారు. వివిధ అత్యవసరాలకు ఒకే నంబర్ ఉండాలని గతంలో కేంద్రప్రభుత్వం సూచించిందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ వచ్చామని అన్నారు. ఇటీవల ఏఐ వచ్చాక అనేక పనులు సులువుగా అయిపోతున్నాయని డీజీపీ ఆనంద్ వెల్లడించారు.





# డీలిమిటేషన్ బిల్లుకు రంగం సిద్ధం?

- ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలపై కేంద్రం కసరత్తు
- మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా ఆమోదింపజేయడమే లక్ష్యం
- సంఖ్యాబల సమీకరణలో బీజేపీ వ్యూహాత్మక అడుగులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:**

డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లుల ఆమోదంపై కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13తో ముగియనున్న నేపథ్యంలో, ఆగస్టు 17 నుంచి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సమావేశాల్లో ఈ రెండు కీలక బిల్లులను ఆమోదింపజేయాలని ఎన్డీయే ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే పార్లమెంట్‌ను అధికారికంగా ప్రొరోగ్ చేయకుండా ఉంచే అవకాశం ఉంది. అవసరమైన సమయంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులు కావడంతో డీలిమిటేషన్ బిల్లుకు ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. అందుకే అవసరమైన సంఖ్యాబలాన్ని సమీకరించేందుకు బీజేపీ ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టింది. అయితే తగిన సంఖ్యాబలం లేకపోవడంతో అప్పట్లో బిల్లుల ఆమోదం సాధ్యపడలేదు. అనంతరం దేశ రాజకీయాల్లో చోటుచేసుకున్న పరిణామాలతో ప్రస్తుతం పరిస్థితులు మారినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. లోక్‌సభలో మొత్తం 543 స్థానాలు ఉండగా, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి 360 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం ఎన్డీయేకు ఉన్న బలం సరిపోకపోవడంతో ఇతర పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు సమాచారం. టీఎంసీ నుంచి విడిపోయిన ఎంపీలు, డీఎంకేలోని కొంతమంది సభ్యులు, మహారాష్ట్రలోని శివసేన, ఎన్సీపీ వర్గాల మద్దతు లభిస్తే అవసరమైన సంఖ్యకు చేరుకునే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు పెరిగే అవకాశం ఉండటంతో సమాజ్‌వాదీ పార్టీ వైఖరిలో కూడా మార్పు వచ్చే అవకాశాలపై చర్చ జరుగుతోంది. అవసరమైన మద్దతు ఖరారైన వెంటనే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకు కేంద్రం పిలుపునిచ్చే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై దేశ రాజకీయాల్లో మరోసారి కీలక చర్చ మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.



## జంతర్‌మంతర్ ఆందోళనలే లక్ష్యంగా కుట్ర?

- ఐఎస్ఐ మద్దతు ఉన్న రెండు ముఠాల గుట్టురట్టు
- నలుగురు మైనర్లతో సహా తొమ్మిది మంది అరెస్ట్
- పెట్రోల్ బాంబులతో దాడుల యత్నం భగ్నం
- రైల్వే ట్రాక్‌ల వద్ద నిఘా కోసం కెమెరాల ఏర్పాటు
- హవాలా ద్వారా నిధులు అందినట్లు అనుమానం

**అమృత్‌సర్, ఆగస్టు 5:**

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న ఆందోళనలను ఆసరాగా చేసుకుని దేశంలో విధ్వంసక చర్యలకు పాల్పడే కుట్రను అమృత్‌సర్ పోలీసులు భగ్నం చేశారు. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్నట్లు అనుమానిస్తున్న రెండు ఉగ్రవాద ముఠాలను గుర్తించి, నలుగురు మైనర్లతో పాటు మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి కుట్రకు సంబంధించిన కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.
పోలీసుల సమాచారం ప్రకారం, అరెస్టైన వారిలో ఎనిమిది మంది జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసన ప్రదేశాన్ని సందర్శించినట్లు గుర్తించారు. అక్కడ పెట్రోల్ బాంబుల తయారీకి అవసరమైన సామగ్రి, ఇతర లాజిస్టిక్ సహకారం అందినట్లు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో పాకిస్థాన్‌లో ఉన్న ఐఎస్ఐ హ్యాండ్లర్ల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. అమృత్‌సర్ పోలీస్ కమిషనర్ గుర్‌ప్రీత్ సింగ్ భుల్లర్ మాట్లాడుతూ, ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్న రెండు ఉగ్ర ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించామని తెలిపారు. ఒక ముఠా రైల్వే ట్రాక్‌ల వద్ద కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి దృశ్యాలను సరిహద్దు దాటి పంపే ప్రయత్నం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యకలాపాలకు అవసరమైన నిధులు హవాలా మార్గంలో సమకూరినట్లు అనుమానిస్తున్నామని చెప్పారు. రెండో ముఠాకు ఐఎస్ఐ హ్యాండ్లర్లు పెట్రోల్ బాంబుల తయారీ, వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. పోలీసు, భద్రతా సంస్థలపై దాడులకు ముందు రెక్కీ నిర్వహించాలని వారికి సూచించినట్లు వెల్లడించారు. అయితే భద్రతా సంస్థలు సకాలంలో చర్యలు తీసుకోవడంతో వారి ప్రణాళికలు అమలు కాలేదని పేర్కొన్నారు. ఈ కేసులో మరికొందరు కీలక వ్యక్తుల ప్రమేయంపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే కుట్రను ముందుగానే భగ్నం చేయడం పెద్ద విజయమని అధికారులు పేర్కొన్నారు.

## 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించారు..

- నీట్ నిరసనల అణచివేతపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు
- విద్యార్థుల ఇళ్లకు గుండాలను పంపించారని విమర్శ
- పారదర్శక విద్యా వ్యవస్థ కోసం పోరాడుతున్న యువతకు మద్దతు




**న్యూఢిల్లీ, ఆగస్టు 5:**

నీట్ పేపర్ లీక్ వివాదంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనలను కేంద్ర ప్రభుత్వం బలప్రయోగం, బెదిరింపులతో అణచివేసిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులతో కలిసి బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, యువతపై వ్యవహరించిన తీరును తీవ్రంగా తప్పుబట్టారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థుల ఇళ్లకు గుండాలను పంపించారని, అనంతరం 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ క్షమాపణలను అంగీకరించడం పూర్తిగా అర్థరహితమని, ఇలాంటి చర్యలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని, వారిని వేధించారని కూడా ఆయన విమర్శించారు. తమ భవిష్యత్తు కోసం శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులు ఎలాంటి హింసకు పాల్పడలేదని, అలాంటి వారిపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. దేశానికి పారదర్శకంగా, విశ్వసనీయంగా పనిచేసే విద్యా వ్యవస్థ అవసరమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థులు రాజ్యాంగ పరిరక్షకులని, కుప్పకూలుతున్న విద్యా వ్యవస్థను ప్రశ్నించడం వారి హక్కు అని అన్నారు. తమ భవిష్యత్తు కోసం ధైర్యంగా పోరాడుతున్న యువతకు కాంగ్రెస్ అండగా ఉంటుందని, వారి పోరాటంపై గర్వంగా ఉందని తెలిపారు.

## జార్ఖండ్ నిరుద్యోగులకు సీజేపీ మద్దతు

- దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తాం
- రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు
- సీజేపీ నేత అభిజిత్ దీప్కే స్పష్టీకరణ



**ముంబై, ఆగస్ట్ 5 :**

జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో డియాతో మాట్లాడిన దీప్కే, జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతీ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా, ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, డియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.



## యువత ఆవేదనను వినాలి

- సీజేపీ నిరసనలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- విద్యార్థుల పట్ల సంయమనం పాటించాలని అధికారులకు సూచన
- హింసతో పరిస్థితులు మరింత దిగజారే ప్రమాదమని హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:**

సీజేపీ నిర్వహిస్తున్న నిరసనల నేపథ్యంలో యువ విద్యార్థి నిరసనకారుల పట్ల అధికారులు అత్యంత సంయమనంతో వ్యవహరించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనల సమయంలో పోలీసు బలగాలు కూడా సహనంతో వ్యవహరించాలని, హింసను అరికట్టే పేరుతో అతిగా స్పందిస్తే పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు.
ఢిల్లీతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో సీజేపీ చేపట్టిన ఆందోళనల్లో హింస, రాళ్లదాడులు జరిగాయని, వాటివల్ల కలిగిన నష్టానికి పార్టీనే బాధ్యులను చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్‌ను విద్యార్థి ఆందోళనలకు సంబంధించిన ఇతర పిటిషన్లతో కలిపి విచారించాలని ధర్మాసనం నిర్ణయించింది.
ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ, యువత ఎందుకు ఆందోళన చేస్తోంది, వారు ఏమి చెప్పాలనుకుంటున్నారో ముందుగా ఓపికగా వినాలని సూచించారు. యువత ఆవేదనను ఆలకించడమే సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రభావవంతమైన మార్గమని వ్యాఖ్యానించారు.
అదే సమయంలో శాంతిభద్రతల నిర్వహణలో భద్రతా సంస్థల విచక్షణపై సుప్రీంకోర్టు విశ్వాసం వ్యక్తం చేసింది. పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో అధికారులకు అవగాహన ఉందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం, సంబంధిత పక్షాల వాదనలు పరిశీలించిన అనంతరం తదుపరి విచారణలో తగిన నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తెలిపింది. జులై 20న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో రాళ్లదాడులు, లాఠీచార్జ్, వాటర్ క్యానన్ల వినియోగం కారణంగా విద్యార్థులు, పోలీసు సిబ్బంది గాయపడిన విషయం విచారణ సందర్భంగా ప్రస్తావనకు వచ్చింది. ఈ నేపథ్యంలో యువత ఆవేదనను అర్థం చేసుకుంటూ శాంతియుత పరిష్కారాల దిశగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది.

## ఎయిరిండియాకు కొత్త సారథి

- సీఈవో, ఎండీగా టెవోల్డే గెబ్రెమరియమ్ నియామకం
- భారీ నష్టాల నేపథ్యంలో టాటా గ్రూప్ కీలక నిర్ణయం
- ప్రస్తుత సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్‌కు వీడ్కోలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:**

భారీ నష్టాలు, వరుస సవాళ్లతో ముందుకు సాగుతున్న ఎయిరిండియాలో కీలక నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. సంస్థ కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ మాజీ చీఫ్ టెవోల్డే గెబ్రెమరియమ్‌ను నియమిస్తున్నట్లు టాటా గ్రూప్ బుధవారం ప్రకటించింది. ప్రస్తుతం సీఈవోగా ఉన్న క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. గత ఏడాది అహ్మదాబాద్‌లో జరిగిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదం, సంస్థకు పేరుకుపోతున్న భారీ నష్టాల నేపథ్యంలో ఈ మార్పు ప్రాధాన్యం సంతరించుకుంది. 202526 ఆర్థిక సంవత్సరంలో ఎయిరిండియా 2.8 బిలియన్ డాలర్ల మేర నష్టాలను నమోదు చేసింది. అదనంగా పాకిస్థాన్ గగనతలం మూసివేత, మధ్యప్రాచ్య ఉద్రిక్తతల ప్రభావంతో పలు అంతర్జాతీయ సర్వీసులు నిలిచిపోవడంతో సంస్థ పునరుద్ధరణ ప్రణాళికలకు ఆటంకం ఏర్పడింది. టెవోల్డే గెబ్రెమరియమ్ ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్‌కు దశాబ్దానికి పైగా నాయకత్వం వహించారు. ఆయన హయాంలో ఆ సంస్థ ఆఫ్రికాలోనే అతిపెద్ద, అత్యంత లాభదాయకమైన విమానయాన సంస్థగా ఎదిగింది. సంస్థ ఆదాయాన్ని నాలుగు రెట్లు, విమానాల సంఖ్యను మూడు రెట్లు పెంచడంలో కీలక పాత్ర పోషించారు. అంతర్జాతీయ హబ్‌ల అభివృద్ధి, నిర్వహణ, మరమ్మతుల మౌలిక సదుపాయాల విస్తరణలో ఆయనకు విశేష అనుభవం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎయిరిండియాను వృద్ధి, లాభదాయకత దిశగా నడిపించే సామర్థ్యం గెబ్రెమరియమ్‌కు ఉందని సంస్థ బోర్డు విశ్వాసం వ్యక్తం చేసింది. టాటా సన్స్, ఎయిరిండియా ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మాట్లాడుతూ, స్థిరీకరణ, విలీన ప్రక్రియలు పూర్తయ్యాయని, ఇప్పుడు సంస్థ విస్తరణ దశలోకి అడుగుపెడుతోందని తెలిపారు. గెబ్రెమరియమ్ అనుభవం ఎయిరిండియాను ప్రపంచ స్థాయి విమానయాన సంస్థగా తీర్చిదిద్దడంలో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2022లో టాటా గ్రూప్ ఎయిరిండియాను స్వాధీనం చేసుకున్న తర్వాత సింగపూర్ ఎయిర్‌లైన్స్ మాజీ అధికారి క్యాంప్‌బెల్ విల్సన్‌ను సీఈవోగా నియమించింది. విలీన ప్రక్రియలు పూర్తి చేయడం, భారీ విమానాల కొనుగోలు ఒప్పందాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన చేసిన సేవలను సంస్థ ఈ సందర్భంగా ప్రశంసించింది.

# ఎట్టకేలకు దిగి వచ్చిన 'మెటా'

- ప్రధాని మోదీకి జుకర్ బర్గ్ క్షమాపణలు
- కంటెంట్‌ల బూస్ట్‌కు డబ్బులు తీసుకున్నట్లు అంగీకారం




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 5:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియో తొలగింపుపై మెటా దిగొచ్చింది. ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్.. ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణలు చెప్పారు. సీఎస్ఏఎమ్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేసిన మెటా.. కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేయడానికి భారీగా డబ్బులు తీసుకున్నట్టు అంగీకరించింది. అంతేకాక తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా అంగీకరించింది. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీకి క్షమాపణలు చెప్పింది. ప్రధాని మోదీ ఫేస్‌బుక్ పోస్టు తాత్కాలికంగా తొలగించిన వ్యవహారం మెటాకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సమన్లు జారీ చేయడంతో మెటా గ్లోబల్ బృందం బుధవారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైంది. దాదాపు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మెటా గ్లోబల్ వ్యవహారాల అధికారి జోయెల్ కాప్లన్ నేతృత్వంలోని బృందం ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. అలాగే కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కూడా మెటా బృందం కలిసింది. జూలై 23న ప్రధాని నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన వీడియోను ఫేస్‌బుక్ కొంతసేపు పరిమితం చేసింది. అనంతరం అది సాంకేతిక లోపం వల్ల జరిగిందని మెటా వివరణ ఇచ్చి పోస్టును పునరుద్ధరించింది. అయితే ఈ వివరణ సరిపోదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సమావేశంలో ప్రధాని పోస్టు వ్యవహారంతోపాటు ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్, ప్రకటనలు, కృత్రిమ మేధతో రూపొందించిన తప్పుడు సమాచార నియంత్రణ వంటి అంశాలపై కూడా ప్రశ్నలు సంధించింది. ప్రముఖ వ్యక్తుల ధృవీకరించిన ఖాతాల్లోని పోస్టులను తొలగించే ముందు మరింత భద్రతా వ్యవస్థ ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. మెటా అల్గోరిథమ్ ఎలా పని చేస్తోంది? పోస్టులు ఏ ప్రాతిపదికన తొలగించబడుతున్నాయి? భారత చట్టాలకు అనుగుణంగా వ్యవస్థ ఎలా పనిచేస్తుంది వంటి అంశాలపై కూడా ప్రభుత్వం వివరణ కోరింది. దేశ భద్రత, ప్రజా శాంతి వంటి అంశాలకు సంబంధించిన విషయాల్లో సోషల్ మీడియా వేదికలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. సోషల్ డియా సంస్థలు భారత చట్టాలను పూర్తిగా పాటించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతోపాటు, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా మెటా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించినట్లు సమాచారం.

## కొత్తగట్టు కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీధర్ రెడ్డి



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా కోరెం శ్రీధర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని పార్టీ సీనియర్ నాయకుడు ఉప్పుగళ్ల మల్లారెడ్డి తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన మత్స్యగిరీంద్ర స్వామి ఆలయం ఉన్న కొత్తగట్టు గ్రామంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో గ్రామ శాఖ కమిటీని ఏర్పాటు చేసి శ్రీధర్ రెడ్డిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఆయన ఎన్నిక పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రోటోకాల్ వివాదంతో సర్పంచుల బాయ్‌కాట్

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



శంకరపట్నం మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం గ్రామాల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశం ప్రోటోకాల్ వివాదంతో ఉద్రిక్తంగా మారింది. వేదికపై సింగిల్ విండో చైర్మన్లను కూర్చోబెట్టడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్, బీజేపీకి చెందిన సర్పంచులు సమావేశాన్ని బహిష్కరించారు. మండలంలోని 27 గ్రామాల సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో తడికల్, మెట్‌పల్లి, గద్దపాక సింగిల్ విండో చైర్మన్లు కీసర సంపత్, గోపగోని బసవయ్య, గాజుల మహేష్‌లను అధికారులు వేదికపైకి ఆహ్వానించారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన బీఆర్ఎస్, బీజేపీ సర్పంచులు ప్రోటోకాల్ పాటించకుండా వారిని వేదికపైకి ఎలా ఆహ్వానించారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. వెంటనే వారిని వేదిక నుంచి దించాలని డిమాండ్ చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో అరగంట అనంతరం సమావేశాన్ని బహిష్కరించారు. అనంతరం అధికార పార్టీకి చెందిన సర్పంచులతోనే సమావేశం కొనసాగగా, వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను వివరించారు. సమావేశంలో ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడిందని విద్యుత్ శాఖ ఏఈ రఘు తెలిపారు. ధర్మారం, కాచాపూర్, రాజాపూర్, కరీంపేట గ్రామాలకు హుజురాబాద్ డిపో బస్సులు నడపాలని సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రూ.20 వేల కంటే తక్కువ బిల్లులు పొందిన లబ్ధిదారులను ఎల్ 1 జాబితాలోకి మార్చే అవకాశం ఉందని ఎంపీడీవో అనిత తెలిపారు. గ్రామ సర్పంచులు, ఇందిరమ్మ కమిటీలు ప్రతిపాదనలు పంపితే పరిశీలిస్తామని ఆమె వెల్లడించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి, ఎంపీడీవో అనిత, ఎంపీవో ప్రభాకర్, వ్యవసాయ అధికారి వెంకటేష్, డిప్యూటీహెచ్వో గొట్టె శ్రవణ్ , పశు వైద్యాధికారి మాధవరావు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు పాల్గొన్నారు.



## తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలం గుడాటిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అనూష మాట్లాడుతూ, పుట్టిన శిశువులకు డబ్బా పాలు కాకుండా తల్లిపాలనే అందించాలని సూచించారు. జననం అనంతరం వెంటనే ముర్రుపాలు పట్టించడం వల్ల శిశువుకు అవసరమైన పోషకాలు అందడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారమని, ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సింగిరెడ్డి సుభాష్ రెడ్డి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్, ఆశ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

## రిత్విక్ కుటుంబానికి చేయూత



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మొలంగూర్ గ్రామంలోని అల్లయ్య కుంటలో ఈతకు వెళ్లి నీటిలో మునిగి మృతి చెందిన బీహార్ రాష్ట్రానికి చెందిన వలస కూలీల కుమారుడు రిత్విక్ (8) కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ మానవతా దృక్పథంతో అండగా నిలిచింది. పార్టీ కార్యకర్తల సహకారంతో సమీకరించిన రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రిత్విక్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచిస్తూ మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గాజులమహేష్, నేరెళ్ల సంతోష్, రాయిని రమేష్, తుమ్మ వెంకటపతి, గాజుల రమేష్, శ్రీనివాస్ వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ మోసాల పద్ధతులు, వాటి నుంచి రక్షణ పొందే మార్గాలను వివరించారు. గుర్తుతెలియని లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని, అనుమానాస్పద ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆశ చూపించి లేదా భయపెట్టి మోసాలకు పాల్పడే అవకాశం ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే సైబర్ నేరాలను నివారించవచ్చని తెలిపారు. "ఆశ పడితే నష్టపోతారు... కష్టపడితేనే ఫలితం వస్తుంది... ఊరికే ఏదీ రాదు" అని పేర్కొంటూ విద్యార్థులు, ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా లంక కిరణ్ కుమార్



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలోని మెట్పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా లంక కిరణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో గ్రామ శాఖ కమిటీని ఏర్పాటు చేసి లంక కిరణ్ కుమార్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.ఆయన ఎన్నిక పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కొరకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని కోరారు.తన నియామకానికి కృషి చేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## హోంగార్డు వేముల లక్ష్మణ్ మృతికి మాజీ విప్ నల్లాల ఓదెలు నివాళి

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



బెల్లంపల్లి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న వేముల లక్ష్మణ్ మృతిపై మాజీ ప్రభుత్వ విప్, మాజీ చెన్నూరు ఎమ్మెల్యే నల్లాల ఓదెలు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వేముల లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నల్లాల ఓదెలు, మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి సూచిస్తూ, లక్ష్మణ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం, సంబంధిత అధికారులు అన్ని విధాలా అండగా నిలిచి అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకోవాలని నల్లాల ఓదెలు కోరారు.

## తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టిన శిశువుకు మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, తల్లిపాలు శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు ఎంతో అవసరమని వివరించారు. ఆరు నెలలు పూర్తైన అనంతరం పిల్లలకు అన్నప్రాసన చేసి, తల్లిపాలతో పాటు పౌష్టికాహారం అందించాలని తల్లులకు సూచించారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి. రాజేష్, వైద్యాధికారి నిహారిక, అంగన్వాడీ టీచర్ ఉదారవతి, ఈపంచాయతీ ఆపరేటర్ రాజశేఖర్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## బెజ్జంకి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కత్తి రమేష్

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

కాంగ్రెస్ పార్టీ గ్రామ స్థాయి నూతన కమిటీల ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా బెజ్జంకి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కత్తి రమేష్‌ను నియమించినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ మాట్లాడుతూ, నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు పార్టీ బలోపేతమే లక్ష్యంగా నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేయాలని అన్నారు. అనంతరం నూతనంగా నియమితులైన కత్తి రమేష్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య, మాజీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్, వార్డు సభ్యులు బోనగం రమేష్, ఎలిగే సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణికి కేంద్రం అండ: రఘునాథ్ వెరబెల్లి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** సింగరేణి సంస్థ ఆదాయం పెంపుతో పాటు రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వేలం ప్రక్రియ లేకుండా బొగ్గు బ్లాక్‌లను కేటాయిస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు మణుగూరు పీకేఓసీ2 డిప్ సైడ్ కోల్ బ్లాక్‌ను కేటాయించిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ శ్రీరాంపూర్‌లోని సింగరేణి ఆర్కే7 గనిని బీజేపీ నాయకులు సందర్శించి కార్మికులను కలిశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, ఇటీవల తాడిచెర్ల2 కోల్ బ్లాక్‌తో పాటు మణుగూరు పీకేఓసీ2 డిప్ సైడ్ కోల్ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం వల్ల సంస్థ ఆర్థికంగా మరింత బలోపేతం కావడంతో పాటు రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని తెలిపారు. ఈ కోల్ బ్లాక్ ద్వారా రానున్న 30 సంవత్సరాల పాటు సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, సింగరేణికి రూ.42,360 కోట్ల ఆదాయం, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్ల ఆదాయం సమకూరుతుందని, సుమారు 2,000 మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవతో గతంలో ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచెర్ల2, ప్రస్తుతం పీకేఓసీ2 డిప్ సైడ్ కోల్ బ్లాక్‌లను సింగరేణికి కేటాయించారని తెలిపారు. ఈ మూడు కోల్ బ్లాక్‌ల ద్వారా మొత్తం 860 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 6,500 మందికి ఉపాధి, సింగరేణి సంస్థకు రూ.1,95,510 కోట్ల ఆదాయం, రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు రూ.48 వేల కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని వివరించారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అండగా నిలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్రం రమేష్, కుర్రె చక్రవర్తి, కమలాకర్ రావు, ఎనగందుల కృష్ణమూర్తి, పట్టి వెంకట కృష్ణ, ఆనంద్ కృష్ణ, ఈర్ల సదానంద్, పొన్నవేణి సదయ్య, కాదాసు భీమయ్య, గొల్ల మహేందర్, కొండ వెంకటేష్, కట్కూరి సతీష్, అట్కాపురం సమ్మయ్య, బొజ్జ నర్సయ్య, రవితేజ తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ రెవెన్యూ పనులు గడువులోగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ వి. రాములు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జిల్లాలో రెవెన్యూ, పౌర సరఫరాలకు సంబంధించిన పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. బుధవారం కోటపల్లి, చెన్నూర్, హాజీపూర్ మండలాల్లో పర్యటించి వివిధ శాఖల పనుల పురోగతిని సమీక్షించారు. ముందుగా కోటపల్లి మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. కోటపల్లి శివారులోని సర్వే నంబర్ 389లో 1.12 ఎకరాల భూమిని గుర్తించినట్లు పేర్కొంటూ, కార్యాలయ నిర్మాణానికి అవసరమైన తదుపరి చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చెన్నూర్‌లోని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంను సందర్శించి ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన బియ్యం తరలింపును ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని గోదాం నిర్వాహకులకు సూచించారు. వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన బియ్యాన్ని నాణ్యతతో, సకాలంలో సరఫరా చేయాలని ఆదేశించారు. రేషన్ కార్డుదారుల ఈకేవైసీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు స్టేజ్ 2 కాంట్రాక్టర్ తగిన సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేసి బియ్యం రవాణాలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని సూచించారు. తదుపరి హాజీపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సాదాబైనామా, భూ భారతి, రెవెన్యూ సదస్సులకు సంబంధించిన దరఖాస్తుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ధ్రువపత్రాల జారీని నిబంధనల మేరకు త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్థానికులకు ఉపాధి కల్పించాలి

**శెనార్తి మీడియా, రామగుండం:**



రామగుండం ప్రాంతంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించి, స్థానిక వ్యాపారులు, చిన్న కాంట్రాక్టర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని రామగుండం కార్పొరేషన్ వెల్డింగ్ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామోజు మహేష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 30-40 సంవత్సరాలుగా రామగుండం కార్పొరేషన్ పరిధిలో వెల్డింగ్ షాపుల యజమానులు, భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలు, ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారులు, రైతులు తదితర వృత్తులపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ, రామగుండం నగర పాలక సంస్థతో పాటు ప్రస్తుతం కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో స్థానిక కార్మికులు, చిన్న కాంట్రాక్టర్లు, వ్యాపారులకు తగిన అవకాశాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రామగుండంలో అమలవుతున్న అన్ని అభివృద్ధి పనుల్లో స్థానికులకు ఉపాధి, స్థానిక వ్యాపారులకు అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. "స్థానికులకు ఉపాధి - రామగుండానికి అభివృద్ధి" అనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని స్థానిక యువత, కార్మికులు, చిన్న వ్యాపారుల ప్రయోజనాలను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

## తల్లిపాలే సంపూర్ణ పోషణ

**శెనార్తి మీడియా, జగిత్యాల:**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం జగిత్యాల పట్టణంలోని జండా మహల్ అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, సాజిదా మాట్లాడుతూ, పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలను అందించడం అత్యంత కీలకమని, తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలనే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలతో చిన్నారులకు అవసరమైన పోషకాలు అందడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడుతుందని వివరించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అతీయ బాను, వంశీ ప్రియా, రిజ్వానా బేగం, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూలనపై పోలీసుల ఉక్కుపాదం





- 17.09 లక్షల విలువైన గంజాయి దహనం కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ
- మత్తు పదార్థాలు విక్రయిస్తే పీడీ యాక్ట్, కఠిన చర్యలు
- రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** గంజాయి ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు రామగుండం పోలీస్ కమిషనరేట్ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. పెద్దపల్లి మంచిర్యాల జిల్లాల పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 81 ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 40.173 కిలోల ఎండు గంజాయితో పాటు 26 గంజాయి మొక్కలను న్యాయస్థానం అనుమతితో ధ్వంసం చేశారు. న్యాయాధికారుల సమక్షంలో నమూనాలు సేకరించిన అనంతరం, కమిషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లిలోని వెంకటరమణ ఇన్‌సినిరేటర్స్‌లో వీటిని దహనం చేశారు. ధ్వంసం చేసిన గంజాయి విలువ సుమారు 17,09,000 రూపాయలు ఉంటుందని పేర్కొన్నారు. అక్రమ లాభాల కోసం గంజాయి సాగు, రవాణా, నిల్వ, విక్రయాలు చేస్తూ యువతను పెడదోవ పట్టించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు స్థానిక పోలీసులు, స్పెషల్ డ్రగ్ కంట్రోల్ టీమ్స్, నార్కోటిక్ విభాగం సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. గంజాయి విక్రయించినా, రవాణా చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, మత్తు పదార్థాలు సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ రామ్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ రమేష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అనిల్, ఎస్ఐ వినీత తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై కఠిన చర్యలు



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రజల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా రోడ్డు భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అధికారులను ఆదేశించారు. కమిషనర్ కార్యాలయంలో రవాణా శాఖ, పోలీసు శాఖ అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక, బొగ్గు, యాష్ తరలించే వాహనాలకు తప్పనిసరిగా టార్పాలిన్ కవర్లు ఏర్పాటు చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల విద్యార్థులను తరలించే ఆటోలతో పాటు అన్ని రవాణా వాహనాల్లో ఓవర్‌లోడింగ్‌ను పూర్తిగా అరికట్టాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, మైనర్లు వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలపై ఎలాంటి రాజీ లేకుండా కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో గోల్డెన్ అవర్ ప్రాధాన్యతతో పాటు రహ్-వీర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, మంచిర్యాల రవాణా శాఖ అధికారి గోపీకృష్ణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వరరావు, శ్రీనివాస్, హసన్, మోటారు వాహనాల తనిఖీ అధికారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అండగా ఉంటాం

- క్యాతనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ సంధ్యారాణి

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణి తెలిపారు. కొత్త ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో వేతనాలు తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చైర్‌పర్సన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కొత్త జీఓ ప్రకారం నెలకు రూ.1,500 నుంచి రూ.2,000 వరకు వేతనాలు తగ్గనున్నాయని, ప్రస్తుతం అమలులో ఉన్న వేతనాలనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరారు. పక్కనున్న మున్సిపాలిటీల్లో పాత వేతనాలే కొనసాగుతున్నాయని, తమకు కూడా అదే విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణి, సీడీఎంఏ అధికారులతో చర్చించి ఉద్యోగులకు గతంలో అమలులో ఉన్న వేతనాలే అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రతి నెల ఒకటో తేదీన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ వేతనాలు చెల్లించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వేతనాలు పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు భూమా గౌడ్, మద్దెల శంకర్ పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలి

- జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలి..
- మహిళలు, పిల్లల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి..
- మంచిర్యాల డీసీపీ భాస్కర్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**




జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహించాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పోలీసు అధికారులను ఆదేశించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పరిపాలనా విధులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో పెరిగే సివిల్ వివాదాలపై చట్టబద్ధంగా స్పందించాలని, భూ వివాదాల్లో రెవెన్యూ అధికారుల అభిప్రాయం తీసుకున్న తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళలు, పిల్లల నుంచి వచ్చే ఫిర్యాదులపై సున్నితంగా వ్యవహరిస్తూ తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్‌లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లక్షెట్టిపేట పోలీసులు సంతృప్తికరంగా విధులు నిర్వర్తిస్తున్నారని డీసీపీ భాస్కర్ అభినందించారు

# బోథ్ ఐసీడీఎస్‌కు నూతన భవనం

- ఐసీడీఎస్ భవన నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలి..
- అందుబాటులో ఉన్న గ్రాంట్లతో పనులు ప్రారంభించాలి..
- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**శెనార్తి మీడియా, బోథ్:**



బోథ్‌లో ఐసీడీఎస్ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో నూతన భవన నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. బోథ్‌లో ఐసీడీఎస్ కార్యాలయానికి భవనం లేకపోవడంపై వెలువడిన వార్తకు స్పందించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. విషయాన్ని వెంటనే పరిశీలించిన మంత్రి సీతక్క శాఖ కార్యదర్శి సృజనతో చరవాణిలో మాట్లాడి, అందుబాటులో ఉన్న గ్రాంట్ల నుంచి బోథ్‌లో ఐసీడీఎస్ నూతన భవన నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సమస్యపై సత్వర స్పందన తెలిపి నిధుల మంజూరుకు చర్యలు చేపట్టిన మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన




- మందమర్రిలో పోలీసుల అవగాహన సదస్సు

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు మందమర్రి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక మదర్ తెరెసా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. "సైబర్ క్రైమ్ – ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ... ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింక్‌లను నమ్మవద్దని, వ్యక్తిగత వివరా లు, ఓటీపీలు, బ్యాంకు సమాచారం ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదిం చాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఏఎస్ఐ మల్లేష్, కానిస్టేబుళ్లు సంతోష్, విశ్వనాథ్, సురేందర్, హోంగార్డు శ్రావణ్ కుమార్, పాఠశాల డైరెక్టర్ బరిగెల సతీష్, బబ్బెర లక్ష్మణ్, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యా యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు



# బాధ్యతగా విధులు నిర్వర్తించాలి..

- కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవాభావంతో పనిచేయాలి..
- కలెక్టర్ చిత్రా మిశ్రా
- ఏడుగురికి కారుణ్య నియామకాలు

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో కారుణ్య నియా మకాల కింద ఏడుగురికి ఉద్యోగాలు కల్పించినట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో నియామక పత్రాలను అందజేసిన ఆమె, ఉద్యోగం పొందిన వారు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ తమ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని సూచించారు. కారుణ్య నియామకాలలో ఐదుగురిని జూనియర్ అసిస్టెంట్లుగా, ఇద్దరిని ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించారు. పశుసంవర్ధక శాఖలో వినేష్, ట్రెజరీ శాఖలో అభిలాష్ ఆఫీస్ సబార్డినేట్లుగా నియామకం పొందారు. అలాగే సీపీఓ కార్యాలయంలో వేల్పుల సుమలత, వర్క్స్ అండ్ అకౌంట్స్ శాఖలో వకులాభరణం విషంత, కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రేహ ఫాతిమా, పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కొల్ల రాజు, శ్రీలక్ష్మి జూనియర్ అసిస్టెంట్లుగా నియామక పత్రాలు అందుకున్నారు.

# భూవివాదాలకు శాశ్వత పరిష్కారం



**శెనార్తి మీడియా, బోథ్:**

భూభారతి భూముల సర్వే ద్వారా రైతులకు స్పష్టమైన భూ సరిహద్దులు నిర్ధారించి, పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సోనాల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, పార్డి గ్రామ సర్పంచ్ చౌహాన్ వినోద్ సింగ్ అన్నారు. సోనాల మండలంలోని పార్డి గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లాపూర్ గ్రామంలో భూభారతి భూముల సర్వే పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఖచ్చితమైన సర్వే నిర్వహించి డిజిటల్ భూ రికార్డులు రూపొందించడం ద్వారా భూవివాదాలు తగ్గడంతో పాటు రెవెన్యూ సేవల్లో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు విజయవంతం కావడానికి రైతులు పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో భూ సర్వేయర్ విలాస్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునీత, జీపీఓలు అనుజ్ఞ, రవీందర్, ఉపసర్పంచ్ అశోక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు..

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాల ని, ఎలాంటి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టం–2010 కింద ఏర్పాటైన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల వివరాలు, వివిధ శాఖల నుంచి రావాల్సిన ఎన్‌వోసీలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# ఈవీఎంల భద్రతపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలి..

- ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తనిఖీలు కొనసాగించాలి..
- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డీ శ్రీనివాస్ రెడ్డి
- ఈవీఎం గోదాంను పరిశీలన

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

ఈవీఎంల భద్రతపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈవీఎం, వీవీప్యాట్ గోదాంల తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాంలోని ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాల భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గోదాంను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి సమగ్ర నివేదికలను పంపిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సిబ్బంది హాజరు, భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈవీఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, ఈవీఎం, వీవీప్యాట్ గదులను పరిశీలించారు. పరిశీలనలో అర్బన్ ఎమ్మార్వో రాజేష్, బీఆర్ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బీజేపీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ ప్రతినిధులు మిడిదొడ్డి కపిల్, మహమ్మద్ పహాద్, ఎంఐఎం ప్రతినిధి మజిత్ హుస్సేన్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## అనధికారిక లీగ్‌లో ఆడిన పాక్ మాజీ క్రికెటర్లకు షాక్

# రెండేళ్ల నిషేధానికి పీసీబీ సిద్ధం



- ఐసీసీ గుర్తింపు లేని టోర్నీలో పాల్గొనడంపై క్రమశిక్షణ చర్యలు

**లాహోర్, ఆగస్టు 5:** పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిబంధనలను ఉల్లంఘించి అనధికారిక క్రికెట్ లీగ్‌లో పాల్గొన్న పలువురు మాజీ ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. ఐసీసీ లేదా జాంబియా క్రికెట్ యూనియన్ గుర్తింపు లేని టోర్నీలో ఆడినందుకు మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఇర్ఫాన్‌తో పాటు పలువురు మాజీ క్రికెటర్లపై రెండేళ్ల నిషేధం విధించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. జాంబియా రాజధాని లుసాకాలో ఇటీవల నిర్వహించిన 'ఏషియన్ లెజెండ్స్ లీగ్'కు ఐసీసీ గుర్తింపు లేదని, జాంబియా క్రికెట్ యూనియన్ కూడా ఈ టోర్నీకి మద్దతు ఇవ్వలేదని పీసీబీ పేర్కొంది. బోర్డు నుంచి ముందస్తు అనుమతి (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) తీసుకోకుండా ఈ లీగ్‌లో పాల్గొనడం నిబంధనల ఉల్లంఘనేనని స్పష్టం చేసింది. ఈ నిషేధం అమల్లోకి వస్తే సంబంధిత ఆటగాళ్లు రెండేళ్లపాటు ఎలాంటి క్రికెట్ కార్యకలాపాల్లోనూ పాల్గొనలేరు. ఆటగాళ్లుగా మాత్రమే కాకుండా పీసీబీ లేదా పాకిస్తాన్ సూపర్ లీగ్ పరిధిలోని జట్లకు కోచ్, మెంటార్ లేదా సలహాదారులుగా కూడా వ్యవహరించలేని పరిస్థితి ఏర్పడుతుంది. క్రికెట్ సమగ్రతను కాపాడడం, ఐసీసీ నిబంధనలను అమలు చేయడం లక్ష్యంగానే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పీసీబీ తెలిపింది. టోర్నీలో 'పాకిస్తాన్ పాంథర్స్'తో పాటు మొత్తం ఆరు జట్లు పాల్గొన్నాయి. లీగ్ కోసం మహమ్మద్ హఫీజ్, సోహైల్ తన్వీర్, ఉమర్ అక్మల్ లుసాకా చేరుకున్నప్పటికీ, టోర్నీకి ఐసీసీ ఆమోదం లేదని తెలుసుకున్న తర్వాత చివరి నిమిషంలో వైదొలిగారు. అయితే మహమ్మద్ ఇర్ఫాన్, ఇమ్రాన్ నజీర్, తౌఫీక్ ఉమర్, రాహత్ అలీ, యాసిర్ షా, జాహిద్ మహమూద్, హసన్ రజా, ఇబ్రార్ హుస్సేన్ తదితరులు జూలై 31న జరిగిన మ్యాచ్‌లో పాల్గొన్నారు. ఈ టోర్నీలో భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌కు చెందిన జట్లు కూడా బరిలోకి దిగినప్పటికీ, ఇప్పటివరకు తమ ఆటగాళ్లపై బహిరంగంగా క్రమశిక్షణ చర్యలు ప్రకటించిన ఏకైక బోర్డుగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిలిచింది.



## కావ్య మారన్ జట్టులోకి

# మిచెల్ మార్ష్

### ఎస్ఏ20 ఛాంపియన్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌తో ఒప్పందం

### రిషాద్ హుస్సేన్‌కూ చోటు.. మరో టైటిల్‌పై గురి

**కేప్‌టౌన్, ఆగస్టు 5:** దక్షిణాఫ్రికా టీ20 లీగ్ (ఎస్ఏ20) ప్రస్తుత ఛాంపియన్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ మరో కీలక ఆటగాడిని జట్టులోకి తీసుకుంది. సన్ గ్రూప్ సహ యజమాని కావ్య మారన్ ఆధ్వర్యంలోని ఈ ఫ్రాంచైజీ ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో రానున్న సీజన్‌లో జట్టు మరింత బలపడింది. మార్ష్‌కు ఎస్ఏ20లో ఆడటం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇటీవల ముగిసిన ఐపీఎల్--2026లో లక్నో సూపర్ జెయింట్స్ తరఫున మిచెల్ మార్ష్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. 13 మ్యాచ్‌ల్లో 563 పరుగులు సాధించి జట్టులో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. అతని దూకుడైన బ్యాటింగ్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌ను ఆకట్టుకోవడంతో అతడిని జట్టులోకి తీసుకుంది. మార్ష్ చేరికతో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ బ్యాటింగ్ విభాగం మరింత పటిష్టమైంది. ఇప్పటికే జట్టులో క్వింటన్ డి కాక్, ట్రిస్టన్ స్టబ్స్, మార్కో జాన్సెన్, ఆన్రిచ్ నార్జే, ఆడమ్ మిల్నే వంటి స్టార్ ఆటగాళ్లు ఉండగా, ఇప్పుడు మార్ష్ రావడంతో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకం మరింత పెరిగింది. మిచెల్ మార్ష్‌తో పాటు బంగ్లాదేశ్ లెగ్ స్పిన్నర్ రిషాద్ హుస్సేన్‌ను కూడా ఫ్రాంచైజీ జట్టులోకి చేర్చుకుంది. 2024 టీ20 ప్రపంచకప్‌లో 14 వికెట్లు తీసి ఆకట్టుకున్న రిషాద్, ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్ ఏఎం ఘజన్‌ఫర్ స్థానాన్ని భర్తీ చేయనున్నాడు. ఎస్ఏ20 చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్టుగా సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ నిలిచింది. ఇప్పటివరకు జరిగిన నాలుగు సీజన్లలో మూడు టైటిళ్లు గెలిచి తన ఆధిపత్యాన్ని చాటుకున్న ఈ జట్టు, మరోసారి ట్రోఫీపై కన్నేసింది. ఎస్ఏ20 కొత్త సీజన్ వచ్చే ఏడాది జనవరి 17 నుంచి ప్రారంభం కానుండగా, అక్టోబర్ 7న మినీ వేలం నిర్వహించనున్నారు. ఇప్పటికే ట్రిస్టన్ స్టబ్స్‌ను కెప్టెన్‌గా కొనసాగించిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టులో వేలం ద్వారా భర్తీ చేయాల్సిన స్థానాలు కేవలం రెండే మిగిలి ఉండటంతో మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

# బీసీసీఐ సమీక్షా సమావేశం వాయిదా

### కార్యదర్శి అస్వస్థతతో ఫ్యూచర్ ప్లాన్ ఆలస్యం

### త్వరలో గంభీర్‌తో కీలక భేటీ.. జట్టు ప్రదర్శనపై సమీక్ష

**ముంబై, ఆగస్టు 5:** ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో భారత జట్టు వరుస పరాజయాలపై నిర్వహించాల్సిన బీసీసీఐ సమీక్షా సమావేశం వాయిదా పడింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అస్వస్థతకు గురికావడంతో ఈ సమావేశం ఆలస్యమైనట్లు సమాచారం. త్వరలోనే ఈ భేటీ నిర్వహించనుండగా, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వర్చువల్ విధానంలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్‌గా కోల్పోయిన టీమిండియా, అనంతరం ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోనూ 3--2తో ఓటమి చవిచూసింది. ఆ తర్వాత జరిగిన వన్డే సిరీస్‌లో కూడా పరాజయం ఎదురవడంతో జట్టు ప్రదర్శనపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆటలోని లోపాలను విశ్లేషించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు బీసీసీఐ సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇంగ్లాండ్ పర్యటన జూలై 19తో ముగిసినప్పటికీ, ప్రస్తుతం భారత జట్టు శ్రీలంకతో ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే రెండు టెస్టుల సిరీస్ కోసం సిద్ధమవుతోంది. అయినప్పటికీ ఇప్పటివరకు సమీక్షా సమావేశం జరగకపోవడం చర్చనీయాంశమైంది. టీ20 ప్రపంచకప్ విజేత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్థానంలో శ్రేయాస్ అయ్యర్‌కు బాధ్యతలు అప్పగించిన తర్వాత భారత్ వరుస సిరీస్‌లు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ఇంగ్లాండ్‌తో మూడో టీ20లో 202 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేవలం 76 పరుగులకే ఆలౌటై 125 పరుగుల భారీ తేడాతో ఓడిపోవడం, నాలుగో మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో పరాజయం పాలవడం తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇక అంతకుముందు ఐర్లాండ్‌తో 2--0 తేడాతో సిరీస్ కోల్పోవడం భారత క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద షాకుల్లో ఒకటిగా నిలిచింది. అయితే ఈ పరాజయాలపై స్పందించిన బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, ఇది తాత్కాలిక ప్రతికూల దశ మాత్రమేనని, అంతర్జాతీయ క్రికెట్‌లో ఇలాంటి హెచ్చుతగ్గులు సహజమని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న సమీక్షా సమావేశంలో జట్టు ప్రదర్శన, భవిష్యత్తు ప్రణాళికలు, ఎంపికల విధానం, జట్టు బలోపేతంపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.






# ఫుట్‌బాల్ మ్యాచ్‌లో పిడుగు బీభత్సం

### మైదానంలోనే 24 ఏళ్ల ఆటగాడు మృతి

### మరో 12 మంది క్రీడాకారులకు గాయాలు

**బ్యాంకాక్, ఆగస్టు 5:** థాయిలాండ్‌లో ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో మైదానంలో పిడుగు పడటంతో విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 24 ఏళ్ల యువ ఫుట్‌బాలర్ సొఫ్వాన్ అవాయే మృతి చెందగా, మరో 12 మంది ఆటగాళ్లు గాయపడ్డారు. ఈ సంఘటన థాయిలాండ్‌లోని సుంగై గోలోక్‌లోని శాంతిపాప్ స్టేడియంలో నిర్వహిస్తున్న 'గోలోక్ ఎఫ్ఏ కప్' టోర్నీలో చోటుచేసుకుంది. సామ్ కోల్ట్స్, అబు ఎక్స్ నాంగ్ సిరిన్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పిడుగు మైదానంపై పడింది. దీంతో సామ్ కోల్ట్స్ జట్టుకు చెందిన వింగర్ సొఫ్వాన్ అవాయే తీవ్రంగా గాయపడి మైదానంలోనే కుప్పకూలాడు. వెంటనే సహచర ఆటగాళ్లు అతనికి సీపీఆర్ అందిస్తూ ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. అనంతరం అత్యవసర వైద్య సిబ్బంది ఆసుపత్రికి తరలించినప్పటికీ చికిత్స ఫలించక అతడు మృతి చెందినట్లు పోలీసులు ధృవీకరించారు. ఈ ప్రమాదంలో గాయపడిన 12 మంది ఆటగాళ్లలో ఒక మలేషియా ఫుట్‌బాలర్ కూడా ఉన్నట్లు స్థానిక పోలీస్ చీఫ్ థున్ సిరిఖుంట్ తెలిపారు. గాయపడిన వారంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. మరణించిన సొఫ్వాన్ అవాయే ఇటీవలే థాయ్ థర్డ్ డివిజన్ క్లబ్ 'యాలా ఎఫ్‌సీ'తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అతని ఆకస్మిక మృతిపై యాలా ఎఫ్‌సీ యాజమాన్యం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. థాయిలాండ్‌లో పిడుగుపాటు ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. అక్కడి డిసీజ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ గణాంకాల ప్రకారం 2020 నుంచి 2024 మధ్య దేశవ్యాప్తంగా 283 మంది పిడుగుపాటుకు గురయ్యారు. వారిలో అధిక సంఖ్యలో బాధితులు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు.



## విజేతలకు ఢిల్లీలో

# ఘన స్వాగతం

### కామన్వెల్త్ పతక విజేతలకు అభిమానుల ఘన సన్మానం

### జూడో స్వర్ణ విజేత అస్మితకు ప్రత్యేక ఆదరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** కామన్వెల్త్ గేమ్స్-2026లో భారతదేశానికి పతకాల పంట పండించి స్వదేశానికి చేరుకున్న క్రీడాకారులకు ఢిల్లీలో ఘన స్వాగతం లభించింది. మంగళవారం ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న భారత బృందాన్ని వందలాది మంది అభిమానులు హర్షధ్వానాలతో ఆహ్వానించారు. ఏడు స్వర్ణ పతకాలు సాధించిన భారత బాక్సింగ్ జట్టుతో పాటు జూడోలో దేశానికి చారిత్రాత్మక స్వర్ణ పతకం అందించిన అస్మితకు అభిమానులు ప్రత్యేకంగా సన్మానం చేశారు. పూలమాలలతో పాటు రూ.50 నోట్లతో తయారుచేసిన దండలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అస్మిత తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. జూడోలో భారత్‌కు స్వర్ణ పతకం సాధించాలనేది తన చిరకాల కల అని, గ్లాస్గోకు బయలుదేరినప్పటి నుంచే స్వర్ణంతోనే స్వదేశానికి తిరిగి రావాలని లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపింది. ఆ లక్ష్యాన్ని సాధించడం జీవితంలో మరపురాని ఘట్టమని పేర్కొంది. భారత క్రీడాకారుల విజయాలతో దేశవ్యాప్తంగా ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. విమానాశ్రయంలో అభిమానులు, కుటుంబ సభ్యులు, క్రీడా సంఘాల ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలుకుతూ విజేతలను అభినందించారు.

# ధుల్ ధాటికి సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ ఘన విజయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ఢిల్లీ ప్రీమియర్ లీగ్-2026లో సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ ఓపెనర్ యష్ ధుల్ అద్భుత శతకంతో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. అరుణ్ జైట్లీ స్టేడియంలో పురానీ ఢిల్లీ-6తో జరిగిన మ్యాచ్‌లో 23 ఏళ్ల ధుల్ కేవలం 47 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్సర్లతో అజేయంగా 100 పరుగులు సాధించాడు. డీపీఎల్‌లో అతనికి ఇది రెండో సెంచరీ. ఈ అద్భుత ఇన్నింగ్స్‌కు గాను 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. వర్షం కారణంగా 15 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పురానీ ఢిల్లీ-6 జట్టు 7 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ బౌలర్ మనీ గ్రేవాల్ మూడు వికెట్లు తీసి ప్రత్యర్థి టాప్ ఆర్డర్‌ను కుదేలు చేశాడు. ఒక దశలో 55 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన పురానీ ఢిల్లీని రోహన్ రాఠీ (46), అశ్విని చిల్లా (38) ఆరో వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకున్నారు. 141 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ 13.2 ఓవర్లలోనే ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. యష్ ధుల్ దూకుడైన బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశాడు. నాలుగో ఓవర్‌లో 23 పరుగులు, ఐదో ఓవర్‌లో మరో 23 పరుగులు రాబట్టి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 22 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసిన ధుల్, అనంతరం అదే జోరు కొనసాగించి శతకాన్ని అందుకున్నాడు. సిద్ధార్థ్ అవుటైన తర్వాత యుగళ్ సైనితో కలిసి రెండో వికెట్‌కు అజేయంగా 81 పరుగులు జోడించాడు. చివరకు దిగ్వేష్ రాఠీ బౌలింగ్‌లో సింగిల్ తీసి



శతకంతో పాటు జట్టు విజయాన్ని కూడా ఖాయం చేశాడు. ఈ విజయంతో సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ గెలిచి పూర్తి ఆధిపత్యంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.




# విడుదలకు సిద్ధమవుతున్న కొరియన్ కనకరాజు

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఇండో–కొరియన్ హారర్ కామెడీ 'కొరియన్ కనకరాజు' విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ప్రముఖ కమెడియన్ సత్య కీలక పాత్ర పోషించారు. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా చూసిన వారి ఒపీనియన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా కామెడీ, వరుణ్ తేజ్ నటన, థమన్ సంగీతం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయని టాక్ వినిపిస్తోంది. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' వంటి విజయవంతమైన కామెడీ చిత్రాలను తెరకెక్కించిన మేర్లపాక గాంధీ, మరోసారి తన మార్క్ కామెడీని ఈ చిత్రంలో చూపించినట్లు సమాచారం. సినిమా తొలి భాగం నుంచి రెండో భాగం వరకు పలు కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని సెన్సార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఇంటర్వెల్ ముందు, తర్వాత వచ్చే ఎపిసోడ్లు బాగా వర్కవుట్ అయ్యాయని అంటున్నారు. అలాగే వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే కామెడీ ట్రాక్‌తో పాటు బుల్లిరాజు పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు కూడా మంచి వినోదాన్ని అందిస్తాయని సమాచారం. సినిమాలో వరుణ్ తేజ్ రెండు విభిన్న కోణాలు ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన సాధారణ యువకుడు కనకరాజు పాత్రలో ఒకవైపు కనిపిస్తే, మరోవైపు కొరియన్ గ్యాంగ్‌స్టర్ ఆత్మ ఆవహించిన తర్వాత పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వంతో కనిపించనున్నారని టాక్. ఈ రెండు పాత్రల మధ్య బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, స్టైల్ పరంగా వరుణ్ తేజ్ మంచి వేరియేషన్ చూపించారని సినిమా చూసిన వారు చెబుతున్నారు. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే వరుణ్ తేజ్ ఈసారి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో కూడా తన నటనతో ఆకట్టుకున్నారని సమాచారం. సినిమా కథ ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో రూపొందినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కియా కంపెనీలో ఉద్యోగం కోసం కొరియా నుంచి వచ్చిన యువతి పాత్రలో రితికా నాయక్ కనిపించనుంది. ఆమెను ప్రేమించే కనకరాజు జీవితంలో అనుకోని మలుపు తిరుగుతుంది. కొరియా నుంచి వచ్చిన ఓ బాటిల్‌లో బంధించబడిన గ్యాంగ్‌స్టర్ ఆత్మ బయటకు వచ్చి కనకరాజును ఆవహిస్తుంది. ఆ తర్వాత కనకరాజు జీవితం ఎలా మారింది? ఆ ఆత్మ కొరియాతో ఉన్న సంబంధం ఏమిటి? చివరకు కథ ఎలాంటి మలుపు తిరిగింది? అనే అంశాల చుట్టూనే సినిమా సాగుతుందని తెలుస్తోంది. సినిమాకు సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు కథకు మరింత బలం చేకూర్చాయని సమాచారం. కామెడీ తర్వాత ఎక్కువ ప్రశంసలు సంగీతానికే వస్తాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

# మిస్సింగ్ మేఘన.. ఫస్ట్ లుక్ విడుదల




రామ్ కార్తీక్ హీరోగా, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రం 'మిస్సింగ్ మేఘన'. ఫస్ట్ కాపీ మూవీస్ మరియు కేడి అండ్ కో బ్యానర్లపై పంచుమర్తి నరేష్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహిస్తున్నారు. గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ రివీలింగ్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం టాలీవుడ్ ప్రముఖ టెక్నీషియన్లు, సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వివి వినాయక్ ఈ చిత్ర పోస్టర్‌ను తన చేతుల మీదుగా విడుదల చేసి సినిమా యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బెక్కం వేణుగోపాల్‌తో పాటు చిత్ర బృందమంతా ఉత్సాహంగా పాల్గొంది. ఈ సందర్భంగా వివి వినాయక్ మాట్లాడుతూ, బెక్కం వేణుగోపాల్, శ్రీనివాస్ ల సహకారంతో దర్శకుడు వాచస్పతి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారని తెలిపారు. ఈ సినిమాతో హీరో రామ్ కార్తీక్, దర్శకుడు వాచస్పతిలకు మంచి పేరు రావాలని, అలాగే సంగీతంతో పాటు పాటలు కూడా అందించే ఆల్ రౌండర్ ధృవన్‌కు ఈ చిత్రం ద్వారా మంచి గుర్తింపు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ చిత్ర యూనిట్ మొత్తానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, వివి వినాయక్ గారిది గో÷–డలెన్ హ్యాండ్ అని, ఆయన చేతుల మీదుగా తమ సినిమా పోస్టర్ లాంచ్ కావడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మీడియా సహకారంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రం ఒక చక్కటి సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఉంటుందని, ప్రేక్షకులను అలరించే అన్ని కమర్షియల్ హంగులు ఇందులో ఉన్నాయని తెలిపారు. అతి త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. హీరో రామ్ కార్తీక్ మాట్లాడుతూ, తమకు ఈ చిత్రంలో అవకాశం కల్పించిన దర్శకుడు వాచస్పతికి, నిర్మాత నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులందరినీ అలరిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధృవన్ మాట్లాడుతూ, లెజెండ్రీ డైరెక్టర్ వి.వి. వినాయక్ చేతుల మీదుగా పోస్టర్ విడుదల కావడం తన కెరీర్‌లో మరువలేని క్షణమని, ఒక మంచి మ్యూజిషియన్‌కు కావాల్సిన అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయని వెల్లడించారు. ఈ చిత్రానికి శామ్ కె. నాయుడు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా, వనరాజ్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు.



# ప్యారడైజ్‌తో పోటీ పడనున్న డోరతి మూవీ




న్యాచురల్ స్టార్ నాని హీరోగా, కయాదు లోహర్ హీరోయిన్‌గా మాస్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, సరిగ్గా అదే తేదీన నానితో పోటీ పడేందుకు ఆయన 'దసరా' సహనటి కీర్తి సురేష్ సిద్ధమవుతుండటం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్న 'డోరతి' చిత్రంలో కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. సంగీత మాంత్రికుడు ఇళయరాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతానికి ఈ రిలీజ్ డేట్‌ను తమిళ వెర్షన్ కోసం లాక్ చేసినప్పటికీ, తెలుగులోనూ ఇదే తేదీకి వస్తే బాక్సాఫీస్ వద్ద నాని సినిమాతో కీర్తి సురేష్ నేరుగా పోటీ పడాల్సి వస్తుంది. మంచి స్నేహితులుగా ఉన్న నాని, కీర్తి సురేష్‌ల చిత్రాలు ఒకే తేదీన బరిలో నిలుస్తుండటంతో ఈ బాక్సాఫీస్ క్లాష్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చివరికి ఈ సినిమాల విడుదల తేదీల్లో మార్పులు ఉంటాయా లేదా అనేదానిపై త్వరలోనే క్లారిటీ రానుంది.

# సందీప్ కిషన్ సరికొత్త చిత్రం కరికాల




యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పుడు పీరియాడిక్ యాక్షన్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. తాజాగా 'కరికాల' అనే భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో పీరియాడిక్ కథలు, రాజుల చరిత్ర, యుద్ధ నేపథ్యంతో రూపొందుతున్న సినిమాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు సందీప్ కిషన్ కూడా ఓ భారీ పీరియాడిక్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'శంబాల' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపిస్తున్నారు. చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై యుద్ధానికి దూసుకెళ్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో ఆయన పక్కనే ఓ సింహం కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యుద్ధభూమి వాతావరణం, భారీ విజువల్స్, పవర్‌ఫుల్ లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. పోస్టర్‌ను బట్టి చూస్తే, ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా చారిత్రక నేపథ్యంతో కూడిన ఎమోషనల్ సాగా కూడా కావచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా తెరకెక్కించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విడుదల తేదీలను కూడా అధికారికంగా వెల్లడించారు. 'కరికాల చాప్టర్ 1' : 2027 జూలై 2, 'కరికాల చాప్టర్ 2' : 2027 అక్టోబర్ 28 అంటే కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రెండు భాగాలను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేయడం విశేషం. ఇప్పటివరకు సందీప్ కిషన్ ఎక్కువగా యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాల్లో కనిపించారు. అయితే 'కరికాల' తో తొలిసారి భారీ పీరియాడిక్ యాక్షన్ కథలో నటిస్తున్నారు. అయితే సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. ప్రస్తుతం 'సిగ్మా' విడుదల కోసం సందీప్ కిషన్ ఎదురు చూస్తున్నారు. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. జులై 31న 'సిగ్మా' విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల ఇది వాయిదా పడింది.

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644